# గ్లోబలి

కవిత్వం

డా. చింతం ప్రవీణ్ కుమార్

ఇండస్ పబ్లికేషన్స్
హైదరాబాద్



**GLOBALI**
A Collection of Selected Poems

**Dr. Chintham Praveen Kumar**

ISBN 978-93-5235-965-3

© Writer

**First Edition :** 05 May 2015

Copies : 1000

Rs. : 100/-     2 $

Cover Image : **MF Hussain**

For Copies :
**Chintham Yadhavva**
# 16-10-236, Shivanagar,
Warangal - 506 002.
Cell : 9346886143
email : drpraveen.kuc@gmail.com
&
All leading Book Shops

Layout, Cover Design & Printing :
**Ankush Printers & Designers**
Nallakunta, Hyderabad - 44
Ph : 27663211, 9912929078

# కృతజ్ఞతలు...

అమ్మ నాన్నలు చింతం **యాదవ్వ, రాజేశ్వర్**లకు

అన్వర్, అల్లం రాజయ్య, అంపశయ్య నవీన్, అల్లం వీరయ్య, అల్లం నారాయణ, కాలువ మల్లయ్య, ఆచార్య కాత్యాయనీ విద్మహే, డా.పంతంగి వెంకటేశ్వర్లు, ఆచార్య వడ్డె రవీందర్, ఆచార్య ఎన్ గోపి, ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, ఆచార్య బన్నా అయిలయ్య, ఆచార్య మసన చెన్నప్ప, కవి యాకుబ్ – శిలాలోలిత, కాసుల ప్రతాపరెడ్డి, డా.సీతారాం, డా. వేలూరి శ్రీదేవి, సుంకరి వీరయ్య, మెట్టు శ్రీనివాస్, డా.పిల్లలమర్రి రాములు, పట్నం శేషాద్రి, ప్రొ॥ జయధీర్ తిరుమలరావు, పి. చంద్, బి.ఎస్.రాములు, డా.పసునూరి రవీందర్, చిర్రా రాజేష్ ఖన్నా, కాంచనపల్లి రాజేందర్ రాజు, డా.గాదె గోపాల్ రెడ్డి–అరుణ (యుఎస్), పామర్తి శంకర్, డా. లక్ష్మి ప్రసాద్, సంగిశెట్టి శ్రీనివాస్, స్కైబాబా, సోమ రామ్మూర్తి, నలిగంటి శరత్, వి.ఆర్ విద్యార్థి, ఎం.డి.మునీర్, ప్రొ॥ మురళి మనోహర్ రావు, ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు, మాజీ మేయర్ ఆర్. రాజేశ్వర్ రావు, ప్రొ॥ కూరపాటి వెంకటనారాయణ, ఆచార్య నన్నె రామస్వామి, డా. బూసి వెంకటస్వామి, డా. గోపు సుధాకర్, డా.గజ్జెల రామేశ్వర్, డా.సంగని మల్లేశ్వర్, చింతం ధనుంజయ, డా.మామిడాల ప్రవీణ్ కుమార్, డా. బేరె బాబు, డా. మడక తిరుమలా దేవి, పెండ్లి అశోక్‌బాబు, పైడిముక్కల ఆనంద కుమార్, కె. ఆనందా చారి, నూర శ్రీనివాస్, శంకర్‌రావ్ శెంకేసి, ఉప్పల రాంచందర్, నాగిళ్ళ రామశాస్త్రి, కుందవజ్జల కృష్ణమూర్తి, మహ్మద్ సిరాజుద్దీన్, పొట్లపల్లి శ్రీనివాస రావు, నల్లెల రాజన్న, అనిశెట్టి రజిత, గట్ల రాంరెడ్డి, తక్కళ్లపెల్లి రాము, లక్కర్సు అశోక్, చింతకుంట్ల రమేష్, అల్లం రాజేష్ వర్మ, దోపతి రామిరెడ్డి, బోడకుంట్ల రవికుమార్, బిల్లా రాజేష్, చింతం అమర్, బొట్టు కమలాకర్, అశోక్, సురేష్, ఎంబాడి రాజయ్య, అశోక్ మోరె, అంబాల దేవేందర్, మట్టెపెల్లి వరుణ్, గాడిపెల్లి మధు, భూక్య తిరుపతి నాయక్, నల్లా వేమన, అరిషం దిలీప్, కొత్తపెల్లి శ్రీనివాస్, వలస ప్రకాశ్, నయీం మామ, గటికె అజయ్, ముత్తినేని పరమేశ్వర్, ఉగ్గె రమేష్, ఉగ్గె మధు, ఊట్ల శేషాచారి, బేరె రామారావు,

వడ్డె సురేష్, సంగని శివ, రాంపల్లి రవి, మ్రరి శ్రీను, బంగారు రమ, కొమ్మాల సంధ్య, నాగపూరి కిరణ్మయి, సుతారి రాధిక, తెల్లం కృష్ణమోహన్, పుప్పాల మనోహర్, మడత భాస్కర్, కక్కెర్ల దయాకర్, మంద వీరస్వామి, చిర్ర రాజు, తిరునహరి శేషు, కర్రెసదాశివ్, మంథని శంకరయ్య, బుర్రి ఉమాశంకర్, గాంధి, ముదిగొండ రాజు, ఇత్తబోయిన తిరుపతి, మేడ రంజిత్, రడపాక విజయ్, బైరి అశోక్, కట్టస్వామి, పర్ల శ్రీశైలం, ఆగపాటి అరుణ్, పాలకుర్తి విజయ్, జైసింగ్ రాథోడ్, దానబోయిన రవి, వడ్లకొండ భాస్కర్, కోటగిరి జయవీర్, జిలుకర నర్సి, ఎలమకంటి అనిల్, కోట్ల రాజు, పెరుమాండ్ల మధుసూదన్, సోమిశెట్టి ప్రవీణ్, దేవులపల్లి కిరణ్, మారేడుపాక రవి, కెత్తె జయశంకర్, గోసుల ఆనంద్, ఎంబాడి శంకర్, అల్లం శంకరయ్య, చింతం ధర్మలింగం, బుద్దె లక్ష్మీనారాయణ, ముత్తె భూమయ్య, బొట్టు రమేష్, రామినేని ప్రశాంత్ –

గోదావరి సాహితీ మిత్రులకు

తెలంగాణ సాహితీ మిత్రులకు

తెలంగాణ కళల వేదిక మిత్రులకు

వరంగల్ రచయితల సంఘం మిత్రులకు

శివనగర్ మిత్ర బృందం, విజ్ఞోదయ మిత్రబృందానికి

వందన హైస్కూల్, ఆర్యవైశ్య హైస్కూల్ మిత్రులకు

మహబూబాబాద్ (U.P.G.C) అధ్యాపక మిత్ర బృందానికి

నవ సమాజ్ సేవా సమితి

కవి సంగమం మిత్రులకు

వివిధ పత్రిక సంపాదకులకు

పెద్దన్న సాయిని నరేందర్, చిన్నన్న జిలుకర శ్రీనివాస్–అరుణలకు...

తమ్ముడు చింతం గిరి – శిరీష, అల్లుడు శ్రవణ్, బంధుమిత్రులకు .....

సహచరి జ్యోతి, పిల్లలు తరుణ్ మణి, పల్లవి గాయత్రి లకు...

## * అంకితం...



కవి అన్వర్ గారికి -

* కవిగా, రచయితగా సాహితీ క్షేత్రంలో సుపరిచితులు
శివనగర్ మట్టి బోలాతనాన్ని గుండెల నిండా నింపుకున్న మానవతావాది
నాకు జెండాలు లేవు మనిషితనమే నా ఎజెండా అని చాటుతున్న
కవి అన్వర్ గారికి నా ఈ 'గ్లోబలి' అంకితం.

**ఈ పుస్తకం వెలువడడానికి సహకరించినవారు**

డా॥ మోటపల్కుల శ్రీనివాస వర్మ, వర్మ చెస్ట్ క్లినిక్, వరంగల్

కొలిపాక శ్రీనివాస్, కాకతీయ విశ్వవిద్యాలయం

రేనా ఈశ్వర్, జూనియర్ లెక్చరర్, ఎర్రబెల్లి, కరీంనగర్

మహ్మద్ హైమత్‌పాషా, ఉపాధ్యాయులు, శివనగర్

వీరికి ప్రత్యేక ధన్యవాదాలు ...

# ప్రవీణ్ కవిత్వం - కొన్ని మాటలు

యవ్వనోద్రేకంలోని దూకుడు వేరు. అప్పుడు కవిత్వం గురించి రాయడానికి ఏ మాత్రం జంకు ఉండేది కాదు. కవిత్వంపై దాహం తీరనప్పటికీ వయస్సుతో పాటు మనసు నిమ్మళమైన తర్వాత కవులపై కత్తులు దూయడమెందుకనిపిస్తున్నది. అందుకే, కవిత్వంపై రాయడాన్ని చాలా వరకు తగ్గించాను. రాయకుండా ఉండాలని మనస్సును ఎప్పటికప్పుడు బుజ్జగిస్తూనే ఉన్నాను. కానీ, వరంగల్ మిత్రులపై ఉన్న ప్రేమ చింతం ప్రవీణ్ కవిత్వంపై రాయడానికి పురికొల్పాయి. ప్రవీణ్‌తో నాకు ముఖపరిచయం లేదు. కవిత్వంతో పని గానీ కవితో ఏం పని అనే మనస్తత్వం నాది. అందుకే ఈ రెండు మాటలు రాయడానికి సిద్ధపడ్డాను.

చింతం ప్రవీణ్ 'గ్లోబలి' ముందు వ్రాసిన కవిత్వం గురించి నాకు తెలియదు కానీ కాస్త కాకలు తీరిన కవిగానే కనిపిస్తున్నాడు. ఆలోచన, అవగాహన, సానుకూల ప్రాపంచిక దృక్పథం ఉన్నవాడిలాగానే ఆయన కవిత్వం చదివితే నాకు అర్థమైంది. ప్రపంచీకరణ, కులం, మానవీయ విలువలు ఆయన కవిత్వానికి ముడిసరుకుగా కనిపించాయి. 'గ్లోబలి' అని తన కవితా సంకలనానికి పేరు పెట్టడానికి వర్తమాన సందర్భం ఉంది. ప్రపంచీకరణ సకల సంస్కృతులను విధ్వంసం చేస్తూ మార్కెట్ విస్తరణ కోసం ప్రపంచాన్ని అంగడిగా మార్చిన సందర్భం ఇది. అందువల్ల ఆయన కవిత్వానికి మూల ధాతువు ప్రపంచీకరణ. ఆ ప్రపంచీకరణ వల్ల విధ్వంసమవుతున్న మానవ సంబంధాలు, మానవీయ విలువలు ఆయన కవిత్వ సారం.

"ఓ పిసినారి చూపు/ అలా/ సంధించావప్పుడెప్పుడో/ ఆ కలువ కళ్ళతో" అనే అందమైన చరణాలతో తన ప్రేమను వ్యక్తం చేసిన ప్రవీణ్ ప్రపంచీకరణ మాయ వల్ల ఆమె దూరం కావడానికి కారణమైన ప్రపంచీకరణ వాస్తవికతను "అవే కళ్ళతో గ్లోబల్ గగనపురాల్లో తిరుగుతున్నావు/ నేనేమో నిన్నే వెతుక్కుంటూ లోకల్ లేన్లలో పరిగెత్తుతున్నాను" అనే చరణాలతో చెప్పేసి ముగిస్తాడు. ఈ మొత్తం సంకలనంలో

నాకు బాగా నచ్చిన కవిత ఈ 'ఆకాశ హర్మ్యం'. దీని ఎత్తుగడ, కొనసాగింపు, ముగింపు అత్యంత ఆర్ద్రతతోనూ, హృదయాన్ని కదిలించేదిగానూ ఉంది. నేను కవిత్వాన్ని పాఠకుడిగానే చూస్తాను. పాఠకుడిగా నా స్పందన అది.

దానికి విస్తరణ కూడా ఉంది ప్రవీణ్ కవిత్వంలో. అది 'పరుగు' కవిత. "...ఒక్క క్షణం/ నువ్ గుర్తొస్తావ్ కదా/ ఆ క్షణం/ స్వేదాన్ని ముంచెత్తే కన్నీళ్ళతో/ నిలువెల్లా తడిసిపోతున్నా చెలీ!" అని అంగలార్చి దానికి కారణమైన ప్రపంచీకరణ ఫలితాన్ని కూడా చెప్పాడు. ఈ చరణాలు గానీ, ఈ రెండు కవితలు గానీ ప్రవీణ్ భావుకతకు నిదర్శనంగా నిలుస్తాయి. ఈ కవితలు నచ్చడానికి మరో కారణం కూడా ఉంది. ఆత్మగతాన్ని లేదా ఆత్మాశ్రయాన్ని వస్తుగతం లేదా వస్త్వాశ్రయం చేసే కాల్పనిక విద్య ప్రవీణ్‌కు తెలుసు.

నిజానికి, ప్రవీణ్ ధిక్కారం కన్నా దు:ఖాన్ని ఒక తెగిపోని దారంలా సాగిస్తూ ఉంటాడు. దేని గురించి రాసినా కూడా ఆర్ద్రత అనేది ఆయన కవిత్వాన్ని ప్రాణప్రదం చేస్తున్నది. దు:ఖాన్ని దోసిలి పట్టి తాగినవాడే కవి అవుతాడు. దు:ఖాన్ని, వర్తమాన స్థితిని చెప్పడం ద్వారా పాఠకుల హృదయాలను కదిలించగలిగితే ఆ కవిత్వ ప్రయోజనం నెరవేరినట్లే, పాఠకులకు లేదా ప్రజలకు ఉద్బోధలు చేయాల్సిన అవసరం లేదు. ప్రజలు తామున్న స్థితిని తెలుసుకోగలిగితే, తమ జీవితాలను మెరుగుపరుచుకోవడానికి ఏం చేయాలో వారే నిర్ణయించుకుంటారు. కవి మాత్రమే కాదు, ఏ సృజనకారుడైనా చేయాల్సిన పని ప్రజలకు తమ స్థితిగతుల పట్ల ఎరుక కల్పించడమే.

ప్రవీణ్ కవిత్వం దు:ఖమనే ఆయుధాన్ని ధరించింది. 'నేనింకా ఏడ్వలేను' కవితలో అది సాంద్రతను సంతరించుకుంది. "దుఃఖాన్నంతా ముంచెత్తే/ ఆ వర్షంలో/ ఇక ఒకసారే/ కన్నీళ్ళతో తడవాలి/ దిక్కులు పిక్కటిల్లే/ ఆ పిడుగుల మధ్య/ బీభత్సంగా అరవాలి" అని అన్నప్పుడు కవి అనుభవ తీవ్రత పాఠకుడిని కూడా కదిలిస్తుంది. ఇలాంటి చరణాలను ఇంకా చాలా ఉటంకించవచ్చు. దు:ఖం ఆయన కవిత్వంలో జాలువారుతూ ఉంటే పాఠకుడు చలించకుండా ఉండలేడు. ఆ తర్వాత ఈ పరిస్థితికి గల కారణాలు ఏమిటి, దాని వెనక ఉన్న శక్తులు ఏమిటి అనే ఎరుక కోసం పాఠకుడు ఆలోచనలో పడిపోతాడు. ముందే చెప్పినట్లు కవి చేయాల్సిన పని అదే.

ఆ దు:ఖాన్ని కొనసాగిస్తూ ప్రవీణ్ నాగరికత ముసుగు వేసుకున్న జీవితంలో కృత్రిమత్వం గురించి మాట్లాడుతాడు. నిజానికి, కవి అనాగరికుడైనప్పుడు దాని గురించి మాట్లాడగలడు. జ్ఞానపు బరుపు, నాగరికత ఉడుపు వదిలేసుకున్న ప్రవీణ్ కృత్రిమ మానవ సంబంధాల గురించి, మానవీయ విలువల విధ్వంసం గురించి తన కవిత్వంలో కళ్లకు కడుతాడు.

ఇక నగర జీవితంలోనే కృత్రిమత్వాన్ని ఆయన నిరసిస్తాడు. నగర జీవితంలోని విషాద సంఘటనలను ఆయన గుదిగుచ్చినట్లు చెప్పాడు. నగరంలో నిత్యం జరిగే సంఘటనలను కవిత్వీకరించడంలో ప్రవీణ్ సఫలీకృతుడయ్యాడు. ఆ సంఘటనలను కవిత్వీకరిస్తూ ప్రపంచీకరణ భూతాన్ని మన కళ్ల ముందుంచుతాడు.

ప్రవీణ్ స్వచ్ఛమైన జీవితాన్ని, మానవ సంబంధాలను కోరుకుంటాడు. మానవ సంబంధాల్లో కృత్రిమత్వాన్ని నిరసిస్తూ సహజత్వాన్ని కోరుకునే విషయంలో ఆయన కవితను నిర్మించే పద్ధతి బాగుంటుంది. 'కృత్రిమ వాస్తవం అనే కవితలో ఆ నిర్మాణ పద్ధతిని చూడవచ్చు. గతంలోని సంబంధాలను నెమరేసుకుంటున్నట్లు స్వచ్ఛమైన మానవ సంబంధాల్లోని ఆత్మీయతను, ఆనందాన్ని చెరువులో చేప పిల్ల గంతులేస్తున్నట్లు, పసితనం కేరింతలు కొడుతున్నట్లు వర్ణిస్తూ వచ్చి కృత్రిమత్వంలోని విషాదాన్ని, అసహజత్వాన్ని చెబుతాడు. దీనివల్ల జీవితంలోని మంచీచెడులను ఒక త్రాసులో ఇరువైపులా ఉంచి తూకం వేస్తున్నట్లుగా ఉంటుంది.

ప్రపంచీకరణ పెనుభూతం తెచ్చిన అవాంఛనీయ మార్పులను ఈ సంకలనమంతా ప్రవీణ్ పేర్చి మనకందించాడు. ముసుగు, ఆకాల మరణ ఋతువు, రింగురోడ్డు, జ్ఞాపకాలు ఇంకా మరిన్ని కవితలు, రింగురోడ్డు మీద ప్రవీణ్ రాసినంత క్లుప్తంగా, బలంగా మరొకరు రాసినట్లు గుర్తు లేదు. రింగురోడ్డును బరియల్ గ్రౌండ్‌గా పోలుస్తూ దాని వికృత రూపాన్ని మన హృదయాలను కదిలించే విధంగా ప్రవీణ్ చెప్తాడు. 'ప్లాస్టిక్ దునియా' అంటూ ప్రవీణ్ ఓ కవితనే రాశాడు. ప్లాస్టిక్ సామగ్రి వల్ల జరుగుతున్న భౌతికపరమైన నష్టం అందరికీ తెలిసిందే, అయితే, మానసిక సంబంధమైన ఆ రూప ప్రక్రియా మార్పిడిని కూడా ప్రవీణ్ తన కవిత్వంలో చెప్పాడు. భౌతిక, మానసికపరమైన అంశాలను కలగలుపుతూ రాసిన కవిత్వాన్ని ప్రవీణ్ పాఠకుల ముందుంచుతున్నాడు.

కవిత్వం మానసిక ప్రక్షాళనకు దోహదపడే ఆయుధమే అయితే ఆ పని ప్రవీణ్ కవిత్వం తప్పకుండా నెరవేరుస్తుంది. ప్రవీణ్ చిట్టిపొట్టి కవితలను కూడా చాలా

బలంగా రాయగలడని ఆ కవితలను చదివితే అనిపిస్తుంది. విస్తృతమైన వస్తువును ఆరు లేదా ఎనిమిది లేదా అంతకన్నా తక్కువ చరణాల్లో కుదించగల నేర్పు ప్రవీణ్‌కు ఉంది.

కవిగా ఈ కవిత్వం ప్రవీణ్‌ను మంచి కవుల జాబితాలో చేరుస్తుంది. కానీ, తనదంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకోవాలంటే తనను బ్రేక్ చేసుకునే కవిత్వం రాయాల్సిందే. కవిత్వ పిపాస ప్రవీణ్‌తో ఆ పని తప్పకుండా చేయిస్తుందని నేను నమ్ముతున్నాను.

**- కాసుల ప్రతాపరెడ్డి**

హైదరాబాద్
14 జులై 2015

# కవిత్వమొక సహజాతం...

చింతం ప్రవీణ్ నాకు కవి కంటే ముందుగా పరిశోధక విద్యార్థిగా తెలుసు. ఏదో సెమినార్ సందర్భంగా మొదటిసారి కాకతీయ విశ్వవిద్యాలయంలో మానవీయ భవనం ముందు ఇతన్ని చూశాను. నిలువెత్తుగా ఉన్నాడు. నిటారుగా నిలబడ్డాడు. భూమికి కాళ్ళను తన్ని పట్టి రివ్వున పైకెగిరే బాణంలా ఉన్నాడు. పేలుడు పదార్థాలను దాచిపెట్టుకున్న కంటైనర్‌లా ఉన్నాడు. భుజాలు శిరస్సు వంచకుండా తనలా తాను నిలబడ్డాడు. మాట్లాడిన నాలుగు మాటల్లోనూ 'నిజం చెప్పండి...ఇది వాస్తవం కాదా... చూస్తూ ఊరుకోవాలా...ప్రశ్నించడం కూడా తప్పేనా...సత్యం ఇలాగే ఉంటుందా... అన్నింటినీ అంగీకరించాలా...స్వంత అభిప్రాయాలు ఉండకూడదా...ప్రజాస్వామ్య పద్దతి ఇదేనా...మీరంతా మనుషులేనా...మీరు మాత్రమే మనుషులా... జవాబుదారి తనం లేదా...' లాంటి మాటలు ఇతను నిలబడి మాట్లాడిన సందర్భంలో నా వేపుకు దూసుకొచ్చాయి. నేను ఏమీ సమాధానం చెప్పలేదు. నిర్ణయశక్తి అధికారం లేనప్పుడు ఇతనికో ఇతను లాంటి మరికొన్ని ఇతనులకు ఇతరులకు నాలాంటి వాడి దగ్గర జవాబులు మాత్రం ఏముంటాయ్.. అనుకున్నాను. అప్పుడే ఇతని లోపలి మనిషిని మనలోకి మనకు తెలియకుండానే ప్రవేశపెట్టి వెళ్ళిపోతాడని నాకు అర్థమైంది.

ధిక్కారం,నిరసన,ప్రతిఘటన,ఆక్రోశం,కలత,వ్యాకులత,ఆందోళన,ఉద్యమింపుల మధ్య ఒక విధేయ సత్యాన్వేషి కూడా ఇతను వెళ్ళిపోయాక నీడగా వెనక నిష్క్రమించాడు...

అవన్నీ సరే,ఇప్పుడేమిటీ 'గ్లోబలి' అంటున్నాడు. గత రెండు మూడు దశాబ్దాలుగా ప్రజల జీవితాలను అత్యంత ప్రభావితం చేస్తున్న గ్లోబలైజేషన్ కుట్రల్ని పట్టి చూపెడుతున్నాడు. ఇలా తన మూడవ సంపుటితో కవిత్వంగా ప్రవేశిస్తున్నాడు. ఇది త్రివిక్రమత్వంగా మన హృదయాల్లోకి పెరుగుతుందనడం నిస్సందేహం.

నా మటుకు నాకు ఇతని కవిత్వంలో చిత్రమైన సెగ ఉంది. వింతయిన కాక ఉంది. ఫెటిళ్ళని చిట్లే నిప్పు ఉంది. తటిల్లతలా మెరిసే నీటి పాయ ఉంది. ఇతని

కవిత్వ పంక్తులు చిన్నచిన్న అగ్నిపర్వతాల్లా శ్వాసిస్తున్నాయి. పొంతకుండలో నీళ్ళు ఉడికినట్లు ప్రవీణ్ కవిత్వం ఉడుకుతోంది.

"మెదడుకు నిప్పంటుకున్న ప్రతీసారి

సిరానీళ్ళో

కాగితపు దుప్పటో కావాలంటూ" ... కవిత్వానికి నిర్వచనం చెబుతున్నట్లుగా ఈ 'గ్లోబలి' కవిత్వం ప్రారంభమవుతుంది –

"సిరా నీళ్ళలోని ఆక్సిజన్‌ను తాగి

అదింకా మండుతుంటుంది

దుప్పటిలాంటి కాగితాన్ని జ్వలిస్తూ".... అంటూ తనలో జ్వలిస్తున్న, తన మస్తిష్కాన్ని జ్వలింపచేస్తున్న కవిత్వం గురించి చెబుతూ మనల్ని గ్లోబలిలోకి ఆహ్వానిస్తున్నాడు –

"ఒక్కొక్క అక్షరం

సిరాలోంచి ఒలుకుతుంటే

గుండెల్లో కొండంత మదనం

రూపం కల్పిస్తానా

ఉసురు తీస్తానా" అంటూ కవిత్వం తనకెంతటి ప్రాణప్రదమైన విషయమో తెలియజేస్తూ కవిత్వమొక సహజాతమనే విషయాన్ని ప్రకటిస్తూ ముందుకు సాగుతున్నాడు.

* * *

ప్రవీణ్ నోరేమి మంచిది కాదు. ఇతని కవిత్వ గొంతు కవనజిహ్వా కూడా అంత సున్నితం కాదు. గొంతులో కంకర గుట్టలున్నై. నాలుకకు రంపపు గతుకుల ఎగుడూ దిగుళ్ళ పదును ఉంది. లేకపోతే 'మాటరానినోరు మంచినోరే కదా' అని ఎత్తి పొడుస్తాడా–

నాకేం ఎరుక నాకేం ఎరుక అని అమాయకంగా చెపుతూనే తనని 'వాడు ఒకటి చేయమని చెప్పి వాడు మరొకటి చేసి ఒక విరుద్ధ ఫలితాన్ని ఎలా పొందాడో, అది ఎవరికి ప్రయోజనాన్ని మరెవరికి హానిని కల్గించిందో చెపుతాడు 'సామ్రాజ్యవాదిలో–

మనకి రాజకీయ కవిత్వం చాలా అధికంగా ఉన్నట్టు కనిపిస్తుంది కానీ అదంతా రాజకీయ కవిత్వం కాదు. ప్రజా విధేయత, రాజ్యవ్యతిరేకతలను ప్రదర్శించే ప్రతీదీ పొలిటికల్ పోయెం కాలేదు. రాజ్య వ్యతిరేకత నీవు చూపకపోయినా సరే, ప్రజానుకూలతను మరిస్తే ,ప్రజల పట్ల విధేయతను విస్మరిస్తే నీ రాజకీయ అవగాహనను,

దృక్పథాన్ని మసకబరుచుకుంటే ఒక అరాజకీయ కవితగా మిగిలిపోతారు...అయితే యువకవి ప్రవీణ్ ప్రజానుకూలంగా ఉండే ఉద్యమ రాజకీయాల పట్ల అత్యంత జాగరుకతతోనే ఉన్నాడు. ఎరుకతోనే ఉన్నాడు,ఒక నిఘా నేత్రంతో కనిపెడుతూనే ఉన్నాడు.

"నాకేం ఎరుక

వాడు

ఆకాంక్షను అంగడి చేసి ఉద్యమించమన్నడనీ

నిలువెల్లా గాయపర్చి మందు పూస్తున్నడనీ..."అన్నప్పుడు పొలిటికల్‌గా ఎక్కడ నిలబడి ఉన్నాడో గ్రహించవచ్చు.

ప్రవీణ్ కవిత్వంలో తనని తాను విడి వ్యక్తిగా కంటే తానొక కోల్పోతున్న గుంపు ప్రతినిధి అన్న స్పృహ చైతన్యాలను ప్రకటిస్తాడు.తనకి తెలుసు తన గుంపుకు విడి గుర్తింపు లేదని.ప్రాంతంగా గాయపడ్డ అస్తిత్వం కనుక ఆ గాయాలకు కారణమైన అన్నింటి పట్ల తీవ్రమైన నిరసన, ధిక్కారం, ఆక్షేపణ, తిట్టు, క్రోధం తదితరమైనవి బయటకు తన్నుకొస్తుంటాయ్ కొన్ని కవితల్లోంచి - ప్రజలు, ప్రభుత్వం, ఉద్యమం, ప్రజాస్వామ్యం, హక్కులు వీటి మధ్యనున్న గతిశీల సంబంధాన్ని కొన్ని కవితల్లో ఆవిష్కరించాడు.

'గరీబ్'లో-

"వెన్నెముక గుండా సాగే నరమేదో

మెలిపడి నిరాకరిస్తున్నా

మెదడు సమ్మె కట్టి

కాళ్ళు చేతులు మొరాయించినా...

శ్రమగంటలు

అతని బ్రతుకును లెక్కిస్తూనే ఉంటాయ్

ఆకలి గంటలు

అతని కడుపులో మోగుతూనే ఉంటాయ్-చాలా పరిపక్వ కవిత.

ఇంకా..,'జడ పదార్థం'లో ప్రపంచ గతిశీలత ధనంతో ముడిపడి ఉన్న విధానాన్ని చాలా చక్కగా నాలుగంటే నాలుగు అక్షరాల్లో తెలియజేసాడిలా-

“ చలనశీల చలన రహిత
పరావర్తిత శోషిత పదార్థాల గుండా
పదార్థాల సమూహాల గుండా
సమూహ నిర్మిత సమాజాల గుండా
ప్రవహించే జడ పదార్థం – ధనం”

ముఖ్యంగా ప్రపంచీకరణ లక్ష్యంగా వ్రాసిన ఈ ‘గ్లోబలి’లో ప్రపంచీకరణ పర్యవసనాలను పరిణామాలను పట్టిచ్చే కవితలు చాలానే ఉన్నాయి.

“లోలోపల వేదనతో
హృదయం పగిలి
ముక్కలౌతున్నా
ఒక్క చుక్క కన్నీరు కార్చలేను
అప్పుడప్పుడూ అనిపిస్తుంటుంది
నేను బండబారానా అని!...అంటూనే
పిచ్చివాణ్ణి
సామ్రాజ్యవాదం
మనిషి నరనరాన సొర్రినంక

ఇంకా కన్నీళ్ళెక్కడివంటూ...” మానవస్పందనలకు స్పందనలకు సంబంధించిన కన్నీళ్ళు కూడా వ్యాపారమైన పరిస్థితిని కళ్ళకు కట్టినట్లు చూపించాడీ కవితలో– ఇంకా ...

“ఆకాశమెత్తు సెల్ టవర్ల రేడియేషన్‌కు నేలరాలిన పిట్టపూవ్వి నువ్వంటూ...” గ్లోబలైజేషన్‌లో మాయమౌతున్న జీవాల గురించి ఆవేదన వ్యక్తం చేస్తూ మాయమౌతున్న మనిషినన్నా బ్రతికించుకుందాం అంటూ పిలుపునిస్తున్నాడు.

గ్లోబలి సంపుటిలోని కవితలు చదివాక అర్థమవుతుంది. అన్నింటికీ సిద్ధపడి ఉండడం ప్రవీణ్ కవిత్వ లక్షణమని...ప్రవీణ్ చేస్తున్న పని కవిత్వాగ్నిని వర్షించడం, కవిత్వోదయాల్ని పుట్టించడం మనలోపలి అరణ్యాలను మేల్కొల్పటం ‘నాకెందుకో ఏడ్పురాదు’ అంటాడు గానీ, ఇదంతా దు:ఖాగ్ని కాదా?

**సీతారాం**

# గ్లోబలి...

విలుప్తమవుతున్న విలువలు
విచ్ఛిన్నమవుతున్న మానవ సంబంధాలు
ప్రవర్తనా వ్యవహారికతలో కృత్రిమత్వం
అన్నింటా విస్తరించిన వ్యాపార ధోరణి
వనరుల వాడకంలో విశృంఖలత్వం
కంప్యూటర్ యుగంలోనూ కుల వైరస్
బతుకునివ్వని చదువులు
బాధ్యతారాహిత్యపు ప్రభుత్వాలు
ఇవన్నీ గ్లోబలికి ప్రేరణలు...

**డా. చింతం ప్రవీణ్ కుమార్**

# కవితలు...


| | | |
|---|---|---|
| 1. | కవిత్వం | 19 |
| 2. | జగం | 20 |
| 3. | నగరం | 21 |
| 4. | కచ్చరం | 22 |
| 5. | ఆకాశ హర్మ్యం | 24 |
| 6. | దేశమంటే | 25 |
| 7. | అకాల మరణఋతువు | 26 |
| 8. | జ్ఞాపకాలు | 28 |
| 9. | విత్తనం | 30 |
| 10. | రింగురోడ్డు | 31 |
| 11. | మొఖం లేనోడు | 32 |
| 12. | ప్లాస్టిక్ దునియా | 34 |
| 13. | గరీబ్ | 36 |
| 14. | గ్లోబలి | 37 |
| 15. | బికారీ | 39 |
| 16. | జడ పదార్థం | 40 |
| 17. | అక్షరం | 41 |
| 18. | నా తెలుగు | 42 |
| 19. | అమ్మ ప్రేమ | 45 |
| 20. | కులమున్నచోట | 46 |
| 21. | మతం | 47 |
| 22. | కృత్రిమ వాస్తవం | 48 |
| 23. | చర్మాజీవి | 50 |
| 24. | కవీ | 51 |
| 25. | ఊరు మంచిదైతే | 52 |

| | | |
|---|---|---|
| 26. | బదలాయింపు | 53 |
| 27. | సూటిగా | 54 |
| 28. | సత్యం కావాలి | 55 |
| 29. | నేనింకా ఏడ్వలేను | 57 |
| 30. | మ్యాన్‌హంట్ | 58 |
| 31. | ముసుగు | 59 |
| 32. | సామ్రాజ్యవాది | 60 |
| 33. | పరుగు | 61 |
| 34. | కాసింత మంచి | 63 |
| 35. | లోపలి మనిషి | 64 |
| 36. | ఊరి పెద్దర్వాజ | 65 |
| 37. | భూమి పుత్రుడు | 67 |
| 38. | పంచ శ్రామికం | 69 |
| 39. | తిరోగమనం | 70 |
| 40. | విష తరంగం | 71 |
| 41. | నేను నువ్వు | 72 |
| 42. | ఆమె | 75 |
| 43. | నీవు | 77 |
| 44. | నిరుద్యోగి | 78 |
| 45. | ప్రపంచీకరణ | 79 |
| 46. | న్యాయం | 80 |
| 47. | కులవర్సిటీ | 81 |
| 48. | అపార్ట్‌మెంట్ | 83 |
| 49. | హ్యూమన్ రోబో | 84 |
| 50. | కాళ్లకు కట్టేసుకున్నా ... | 85 |
| 51. | వాడింకా మాతోనే | 86 |
| * | ఒక్క మాట | 88 |
| * | గ్లోబలి వెనుక | 92 |

# 1 కవిత్వం

మెదడుకు నిప్పంటుకున్న ప్రతీసారి
సిరా నీళ్ళో
కాగితపు దుప్పటో కావాలి
ఐనా అది ఆరదు
కవిత్వపు ఆకలి దానిది
●
సిరా నీళ్ళలోని ఆక్సిజన్‌ను తాగి
అదింకా మండుతుంటుంది
దుప్పటిలాంటి కాగితాన్ని జ్వలిస్తూ
●
కప్పివేయడానికో ఆర్పివేయడానికో
నీ తరం కాదంటోంది
కవిత్వం కోరడం చేత
కవిత్వాన్నే కోరడం చేత

03-11-2014

# 2 జగం

నాకేం తెలుసు
నేను పుట్టకముందే
ఈ లోకం
శివతాండవంలో ఉన్నదనీ

●

అడుగుపెట్టాక కదా తెలిసింది
ఈ జగమొక
రుద్రభూమి అని-

06.09.2013

# 3 నగరం

నగరం
ప్రవహించే డాలర్ల సముద్రం
నిషానిచ్చే కొకైన్ కబంధ హస్తం
కాక్‌టైల్ కరాళ నృత్యం
అందాల అమ్మకపు చిత్రం
•
నగరం
కాపిటలిస్ట్ చేతిలో కార్మికుని స్వేదం
అన్నార్థుల చేతిలో ఆకలి పల్లెం
నిరుద్యోగి చేతిలో విషపు మాత్ర
ఉన్మాది చేతిలో ఆసిడ్ పాత్ర
•
నగరం
చీకటి తప్పును మోసే డస్ట్‌బిన్
గూడు చెదిరిన గుండెల ఫుట్‌పాత్
బతుకును హైజాక్ చేసే ఫ్లైఓవర్
మానవత్వాన్ని మింగే మ్యాన్‌హోల్
•
నగరం
కసాయితనపు కవాతు జంక్షన్.

27-10-2008

# 4 కచ్చరం

కొరడా చేపట్టే హస్తాలు మారుతున్నాయ్
నెత్తురు చిందించే శరీరాలు మారట్లేదు

•

బతుకు మొదలైన దగ్గర్నుండీ
పరిగెత్తడమే
మా జీవితమైంది

ఇప్పుడు నా వంతు..

•

ఒకప్పుడు
కోల్పోయిన జీవితం
ఇప్పుడు
పొందాల్సిన జీవితం
నన్ను పరిగెత్తిస్తున్నాయ్
విరామం లేకుండా

•

మారింది
కచ్చరం స్వరూపమే
స్వభావం కాదు

•

నా స్లేవరిజానికి
అందమైన ముసుగు తొడిగిన
నయా జమానా కచ్చరం
మీకెక్కడా కనిపించదు

●

నెత్తురు ఎక్కడా నమోదు చేయబడదు
ఆర్తనాదం ఎక్కడా రికార్డ్ కాదు
ప్రాణాలు మాత్రం గాల్లో కలిసిపోతుంటాయ్

●

ఏం మారలేదు
నా పరుగు ఆగలేదు
నేనింకా పరిగెత్తుతూనే ఉన్నాను.

10-11-2012

# 5 ఆకాశ హర్మ్యం

ఏటవాలుగా
ఆకసాన్ని చూస్తు నువ్వు
నిశ్చలంగా
నిన్ను చూస్తూ నేను

●

నీ చూపులెప్పుడు
ఆకసం దిగిరావు
నేనేమో నీ మోహపు కత్తుల ఒరలోంచి
బయటపడలేను

●

ఓ పిసినారి చూపు
అలా
సంధించావప్పుడెప్పుడో
ఆ కలువ కళ్ళతో ...

●

అవే కళ్ళతో గ్లోబల్ గగనపురాల్లో తిరుగుతున్నావు
నేనేమో నిన్నే వెతుక్కుంటూ లోకల్ లేన్లలో పరిగెత్తుతున్నాను

# 6 దేశమంటే...

ఎంత వెదికినా
కాసింత మట్టి ...
మట్టిమనిషీ కనిపించట్లేదు దేశంలో

●

దేశమంటే మనుషులోయ్
ఏమోగాని
మట్టి అయినా బాగుండు

●

నేడు-
దేశమంటే మట్టి కాదు
మనిషీ అంతకన్నా కాదు
దేశమంటే
దోచుకునే సంస్థలు
దాచిపెట్టే బ్యాంకులు-

# 7 అకాల మరణ ఋతువు

సరిహద్దులు దాటిన ప్రాణానికి
ఇక ఏ గ్యారెంటీ లేదు

●

అకాల మరణాల వసంతంలో
ఆయువొక సుడిగాలి దీపం

●

వీసాలు, పాస్‌పోర్టులు
నిస్సిగ్గుగా
ప్రాణాలను ప్రమోట్ చేస్తుంటే...
డాలర్లు పాడే థండర్ మ్యూజిక్‌లో
వలసబోయిన జిందగీలన్ని
నెత్తురు ముద్దలవుతున్నాయి

●

నాలుగు రాళ్ళకోసం ఖండాలు దాటితే
పగబట్టిన పరదేశి
సాయుధమై పలకరిస్తున్నడు

●

అక్కడ గ్రేవ్‌యార్డులో ఆర్కెస్ట్రా సంగీతం
ఇక్కడి తల్లుల గుండెల్లో మరణమృదంగం

●

బతుకునివ్వని ఏలికల ప్రేమ
శవపేటికల్ని ఉచితంగా అందిస్తున్నందుకు
తలా కొంచెం సిగ్గుపడదాం

●

చిగురించే ఆశలకి ఆలోచనలకీ
చరమగీతం పాడిన చేతులు
అబ్రాడ్‌లో
మరణశయ్యలను సిద్ధం చేస్తున్నాయి

●

బతకడానికి లేకున్నా
చావడానికైనా ఇక్కడ ఫ్రీడం ఉంది

●

భూ బకాసురులు ఎంత మేసినా
అక్కున చేర్చుకోడానికిక్కడ
ఇంకా కొన్ని శ్మశానాలు మిగిలే ఉన్నయ్

●

మనుషులను ఎక్స్‌పోర్ట్ చేస్తూ
చావులను ఇంపోర్ట్ చేసుకుంటున్న
ఓ నా దేశమా.. నీకో సలామ్!

●

చావడానికే అయితే
అమెరికా అరబ్బు ఆస్ట్రేలియాలకెందుకు?
ఇక్కడే బతుకుదెరువు కోసం
అటో ఇటో తేల్చుకుందాం రండి.

*పరాయి దేశాల్లో ప్రాణాలను కోల్పోయిన దోస్తులను యాది చేసుకొని –*

# 8 జ్ఞాపకాలు

ఆకురాలిన చెట్లు  మళ్ళీ చిగురించినట్లు

మనం నడుస్తూ నడుస్తూ
జ్ఞాపకాలను మోస్తుంటాం
●

జ్ఞాపకాలెప్పుడూ
గుండె లోతుల్లో తడిసి స్పర్శిస్తాయ్

కొన్ని జ్ఞాపకాలు
గొంతు తడారేలా...
కొన్ని మాత్రం వెచ్చని కౌగిలిగా
●

హృదయం మూగబోయినపుడు
కండ్లు కన్నీళ్ళ జలపాతమైనపుడు
నిట్టూర్పుగా ఒంటరైన వేళ
ఆత్మీయ ఆలంబనలు - జ్ఞాపకాలు
●

గ్లోబల్ కబందహస్తాల్లో
గూడు చెదిరిన పక్షుల్లా
చెట్టుకొకరం పుట్టకొకరమైనప్పుడు
సహచరులు - జ్ఞాపకాలు
●

ఆవేదనలు ఆర్థిక స్పర్శతో
తొలగిపోయే దినాలు
మనిషిని అనామకుడిని చేస్తున్నాయి

భౌతికంగా చుట్టూ అందరూ
భారంగా నిష్క్రమిస్తుంటారు
మానసికంగా ఒక్కడిని చేస్తు

●

ఆర్టిఫిషియల్ నవ్వులు
ఏ మాత్రం భరోసా కలిగించలేక
తుళ్ళిపడి నవ్విన రోజుల దృశ్యాలు
ఆనంద భాష్పాల్లాగా మారుతాయి

●

చుట్టూరా అల్లుకున్న బంధాలన్నీ
దిక్కులు మార్చుకుంటుంటే
గత్యంతరం లేక
ఓ దిక్కుకు లాక్కెళ్ళబడతాం
అనాలోచితంగా
అయిష్టంగా

●

శిథిలమౌతున్న జ్ఞాపకాల్లో
కొన్నింటిని వెంట పెట్టుకుంటాం
ఎక్కడ చేజారిపోతాయేమోనని
భయంగా బాధగా ఆర్ద్రంగా

22-09-2009

# 9 విత్తనం

నీ జీవవిత్తనం
భూమిలా మారడం కన్నా ముందే
ఇంకొన్ని విత్తనాలకు ప్రాణమివ్వు

అవి
మొక్కలై మొలకెత్తి
జ్ఞాన వృక్షాలై
నీ సమూహానికి నీడనిస్తాయ్
బుద్ధునికి రావి చెట్టుమల్లె-

# 10 రింగురోడ్డు

మునుపిక్కడ ఊరుండేది
ఇప్పుడు రోడ్డుంది

●

మునుపిక్కడ మనుషులుండేవారు
ఇప్పుడు శవాలుంటున్నాయ్

●

ఊరు కాటకల్సి
రోడ్డయ్యింది
రోడ్డు ఊరును మింగి
బరియల్ గ్రౌండ్ అయ్యింది

08-07-2012

# 11 మొఖం లేనోడు

వాడికీ
హృదయముంటుంది
దానికి స్పందన ఉండదు
అది స్పర్శించదు–

●

అప్పుడప్పుడు–
వాడి మాట వినపడుతుంది
వాని చేతలు కనపడుతాయ్
కనిపించనిదల్లా
వాని మొఖమే

●

వాడెప్పుడూ
కారణాలు వెతుకుతుంటడు
ద్వేషించటానికి–
ఊరు వాణ్ణి ప్రేమించటానికి లాగా–

●

వాడెప్పుడూ
అవసరాల అక్కసుల నడుమ
అనుబంధాల సాలెగూడు అల్లుతుంటడు

●

గడిచిన ప్రతి నిమిషం
పలికిన ప్రతీ మాట
ఎదురుతిరిగి ప్రశ్నిస్తున్నా...

నడిచిన ప్రతీదారి
విడిచిన ప్రతీ అడుగు
రెప్పపాటు దూరంలో వెంబడిస్తున్నా...

కాంక్రీట్‌పై చరిస్తున్న వాడు
హృదయాన్ని కాంక్రీట్ లాగా మార్చుకుంటడు
●
నాగరికత నీళ్లు తాగిన వాడు
మంచితనం నుండి కాటకలుస్తడు
మనిషితనం నుండి మాయమైపోతడు
●
ఊరిడ్సిన వాడు
ఊరును విడిచేస్తడు

18-01-2012

# 12 ప్లాస్టిక్ దునియా

రోజు ఎంతోమందిని
అనివార్యంగా
భుజాలపై మోస్తున్నా
ఎంతమందిని నింపుకోగలం
గుండె నిండా–

●

అయితే–
ప్రేమించడమంటే
కోల్పోవడంగా మారిన ఈ దునియాలో
నిజానికీ
ఎవ్వర్నీ పరుచుకోవద్దు
హృదయం నిండా–

●

ఈ జనాలకి ప్రేమంటే
బహిర్ దృశ్యమే
అంతర్గతాన్ని ఎవ్వరూ విశ్వసించరు

●

కరచాలనాలు
కౌగిలింతలు
చిరునవ్వులు
మాటలు
చివరికి బతుకులు...

అంతా అర్టిఫీషియల్
అంతా ప్లాస్టిక్ జమాన
●
నిజంగా
నువ్వు బతకాలంటే
అర్జెంటుగా
నీ గుండెను పీకి అవతల పారెయ్
●
నిజంగా
నువ్వు బతకాలంటే
ప్లాస్టిక్ గుండెను అమర్చుకో
ప్లాస్టిక్‌ను నిషేదించినట్టు
ప్లాస్టిక్ జిందగీలను
నిషేదించేదాక_

20-03-2012

# 13 గరీబ్

వెన్నెముక గుండా సాగే నరమేదో
మెలిపడి నిరాకరిస్తున్నా
మెదడు సమ్మె కట్టి
కాళ్ళు చేతులు మొరాయించినా

శ్రమగంటలు
అతని బ్రతుకును లెక్కిస్తూనే ఉంటాయ్
ఆకలి గంటలు
అతని కడుపులో మోగుతూనే ఉంటాయ్

# 14 గ్లోబలి

లోలోపల వేదనతో
హృదయం పగిలి
ముక్కలౌతున్నా
ఒక్క చుక్క కన్నీరు కార్చలేను.

అప్పుడప్పుడూ అనిపిస్తుంటుంది
నేను బండబారానా అని!
●
కొందరేమో ఆశ్చర్యంగా
క్షణాల్లో కన్నీళ్ళ కొలనౌతారు
చూస్తుండగానే...
●
అలా రోడ్డుమీద ఓఅడుగు వేస్తానో లేదో
కకావికలమౌతాను
మెదడులో ఆలోచనకాలోచనాలు
ఉక్కిరి బిక్కిరి చేస్తాయ్
ఒక్కో దృశ్యం
గొంతు తడారేలా చేస్తుంది ...
●
ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర
పాపను చంకనెత్తుకున్న బిచ్చగత్తె
బస్టాండ్లు రైల్వే స్టేషన్లలో
కోల్పోవడానికి సిద్ధంగా ఉన్న యవ్వనవతి

స్వేదం కురుస్తున్నా
బతుకు రిక్షాబండిని లాగుతున్న వృద్ధుడు
వివర్ణ ప్రతిబింబాలై
విచలిత బతుకులను భుజాలపై మోస్తున్న బాటసారి

బతుకు సుడిగుండంలో జీవితాన్ని కోల్పోతున్న వీళ్ళందరు
గుండెను నిమిషానికి వెయ్యిముక్కలు చేస్తారు...
అయినా ఒక్క చుక్క కన్నీరు ఉబికి రాదు
●
అలా సమాజ మరుభూమిలో
ఎవరైనా బతుకు పందానికి ముగింపు పలికితే
వెళ్తానా ...

సానుభూతి చూపిస్తు కొందరు
తెచ్చిపెట్టుకున్న కన్నీళ్ళతో ఇంకొందరు
నిలువెల్లా తడిసి ముద్దయ్ పోతుంటారు
దింపుడు కల్లెంలో ప్రాణం దొరకని చోట
అక్కడ దొరికిపోతాన్నేను
●
ఒక్క చుక్క కన్నీరు రాదు
వీడో బండరాయంటారు కొందరు.
●
పిచ్చివాళ్లు
సామ్రాజ్యవాదం
మనిషి నరనరాన సొర్రినంక
ఇంకా కన్నీళ్ళెక్కడివి

10-06-2012

# 15 బికారీ

అతుకుల బొంతలాంటి
బతుకులు కావచ్చు వాళ్ళవి
కానీ
వాళ్ళ మనసుకు ఏ చిరుగూ ఉండదు

●

వాళ్ళు-
దాచుకోడానికి స్విస్సులు
దోచుకోడానికి స్కాములు
కోరట్లేదు

●

వాళ్ళు
వాళ్ళ బ్రతుకులో
చందమామ చల్లదనాన్నీ కలగనటం లేదు
మండుతున్న ఆకలి సూర్యుడికింత
'పచ్చిపులుసు ముద్ద' అంతే చాలంటున్నారు-

# 16 జడ పదార్థం

చలనశీల చలన రహిత
పరావర్తిత శోషిత పదార్థాల గుండా
పదార్థాల సమూహాల గుండా
సమూహా నిర్మిత సమాజాల గుండా
ప్రవహించే జడ పదార్థం - ధనం

# 17 అక్షరం

ఒక్కొక్క అక్షరం
సిరాలోంచి ఒలుకుతుంటే
గుండెల్లో కొండంత మదనం

రూపం కల్పిస్తానా
ఉసురు తీస్తానా అని-

# 18 నా తెలుగు

మాతృదేశంలోనే
ఇప్పుడొక మరుగునపడ్డ పదం తెలుగు

●

నడుస్తున్న చరిత్రలోనే
అటకెక్కిన తాళపత్ర గ్రంథం తెలుగు

●

మడికట్టుక్కూర్చున్న ఇంగిలీషు బళ్ళో
ఇప్పుడొక మైలపడ్డ పదం 'తెలుగు'

●

చర్చలు లేని ఎన్‌కౌంటర్లు జరిగిపోతూ ఉంటే
తలదాచుకున్న మిలిటెంటులా ఉంది తెలుగు

●

అమ్మానాన్నల ఆశలకు
మసిపూసిన
మమ్మీ డాడీలు
ఈ శతాబ్దపు భాషా పరిణామం
సీసాపాలనే అమ్మపాలుగా సిద్ధాంతీకరించడం
ఈ శతాబ్దపు మేథోవికాసం

●

పోగు చేసుకున్న భాష అంతా
కాన్వెంట్ బళ్ళో
కార్పొరేట్ కౌగిళ్ళో
సమాధి చేస్తూ
వీసా పాస్‌పోర్టులు నిస్సిగ్గుగా
పరాయిభాషని మన నాలుకలపై అంటిస్తున్నాయ్

●

మొఖానికి రంగులేసుకున్నోళ్ళు
తెలుగులో మాట్లాడుతున్నప్పుడు
దేశభాషలందు నా తెలుగు లెస్స?

●

మనమిప్పుడు
తలాకొంచెం సిగ్గుపడదాం !
స్వంత ఇంట్లో పరాయిలా ఉన్న మన తెలుగు చూసి
స్వంత ఊళ్ళో వెలికి గురౌతున్న మన తెలుగును చూసి

●

మనమిప్పుడు
మూకుమ్మడిగా తలదించుకుందాం!
తేనెలొలుకు తెలుగుకు తగులుతున్న బెత్తం దెబ్బలను చూసి

●

ఇక
ఇప్పుడు మనకు కావలసినది
హోదాలు సొదలుకావు

ఆకలితో అలమటిస్తున్న వాడికి
అందలమెందుకు?

●

పదండి -
కొత్త శిలాశాసనం వేద్దాం
తెలుగును బతికించడానికి
సామూహికంగా ఉద్యమిద్దాం
తెలుగుకు ప్రాణప్రతిష్ట చేయడానికి

(ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా)

02.08.2012

# 19 అమ్మ ప్రేమ

రక్తపాతాన్ని చూసి గాని
రాజ్యహింసను చూసి గాని కాదు

అమ్మ ప్రేమను చూసి
వెన్నులో వణుకుపుట్టింది

# 20 కులమున్నచోట...

ఎడారిలో
నీళ్ళు దొరకని చోట
కన్నీళ్ళైనా తాగి బతకగలను
కానీ..
కులమున్న చోట
ఎన్ని జీవనదులున్నా బతకలేను

12-01-2013

# 21 మతం

మనిషి రక్తం పులుముకుని
వాడి అస్తిపంజరపు అలంకరణతో
శవాల దిబ్బలపై ఊరేగే
ఏ మతాన్ని నేను పొగడలేను
నాది
మనిషితనం
వాడి ఆనందమే నా అభిమతం

# 22 కృత్రిమ వాస్తవం

ఒక్క పలకరింపుతో
పగలూ రాత్రీ
ఊహల పల్లకిలో ఊరేగేవాణ్ణి

●

ఒక్క చిరునవ్వుతో
ఆత్మీయ ఆలంబనలు
చుట్టూతా అల్లుకునేవాణ్ణి

నేనొక వెర్రివాణ్ణి...

●

అబ్బా!
నటించడం
ఈ జనాలు ఎక్కడ నేర్చారు
ఒక్కొక్కనిలో ఒక్కో మహానటుడు
జీవించడమే మానేసి
నటించేస్తున్నరు

నటించడానికి జీవించడానికి మధ్య
సన్ననిరేఖ చెరిపేస్తూ

●

నటించేవాడి మస్తిష్కానిక్కూడా తెలియని
గంభీరమైన నటన
నిజాన్ని అవశేషంగా
మార్చే నటన

●

అనుకుంటాం గానీ -
మనసును గాయపరిచి
కన్నీటి సునామీలు సృష్టించే వాస్తవం కన్నా
నటనే ఒక్కోసారి జీవం పోస్తుంది

మాటకు
మనసుకు
మనిషికి_

06-03-2012

23

# చర్చాజీవి

సభలు సమావేశాలు కట్టీ కట్టీ
పాత రాతియుగాల నాటి రోత పుట్టి
చివరికిలా మిగిలాం పురావస్తువులా

●

ఏదో చేద్దామనుకునేలోపే
ఉసురుమంటూ మనిషి
మారుతున్నాడిలా మరో రూపంలా

●

అతి తర్కం వితర్కం అవుతున్నది
అతి చర్చ అనర్థమౌతున్నది
అతి శాంతి అశాంతికి కారణమౌతున్నది

●

ఐనా
తర్కం ఆపం
చర్చను నిలపం
శాంతిని వీడం

●

మనిషి సంఘజీవే కాదు
చర్చాజీవి కూడా

# 24 కవీ

కవీ-

కనబడాల్సింది
ఆకాశంలో ఎగిరే
పతంగం లాంటి కవిత్వం
దారం లాంటి నువ్వు కాదు
●
అలాగని మరీ
ఆకాశం వంకే చూడకు
అప్పుడప్పుడైనా నేలను చూస్తుండు
●
ఆకాశంలో రాసే అక్షరాలకెప్పుడూ
రూపముండదు
జీవముండదు -

# 25 ఊరు మంచిదైతే...

నాలుగించుల నాలుక
ఆరడుగుల మనిషిని
వాడి మనిషితనాన్ని నిర్ణయించడం
ఎంత విచిత్రమో కదా...

●

నోరు మంచిదైతే
ఊరు మంచిదవడం ఏమో గానీ
ఊరు మంచిది కాకున్న
నోరు మంచిది కావాలనడమే విడ్డూరం

●

ఐనా
యుద్ధనీతి పాపభీతి లేని
రాజ్యాన్ని తిట్టి తిట్టి నోరు అలసిపోయింది
పల్లెత్తు మాట రాక మూగబోయింది

●

మాటరాని నోరు మంచినోరే కదా సార్!

# 26 బదలాయింపు

సమానతలు
అసమానతలు సరే!

వాడి సంపదనెలాగో
మనం బదలాయించుకోలేము

మన ఆకలినైనా
వాడికి బదలాయిద్దాం

# 27 సూటిగా

ప్రపంచీకరణ ప్రేయసిలా
ముందు కౌగిలించి
వెనక బురద చల్లకు
చాటు మాటుగా మాట్లాడి
హృదయాన్ని గాయం చేయకు
●
ప్రేమించినా ద్వేషించినా
దుమ్మెత్తిపోసినా
దుర్భాషలాడినా
సూటిగా చెయ్...
●
ఇగోలా ఇజాల మధ్య నక్కి
ఇరుకిరుకు గోడల మధ్య చిక్కి
మనసును కకావికలం చేయకు
మనిషితనాన్ని చంపేయకు
●
గాయపర్చాలంటే
సూటిగా గాయపర్చు
మనసునైనా
మనిషినైనా-

14-05-2012

# 28 సత్యం కావాలి!

సత్యాన్వేషణ ప్రతీ అడుగులో
అసత్యపు పూర్ణకుంభాలే స్వాగతం పలుకుతున్నా
నేను సత్యాన్నే ప్రేమిస్తాను
సత్యమే నా ఎజెండా

●

అసత్యాన్ని పెనవేసుకున్న ఏ సత్యం నాకక్కరలేదు
నన్ను నన్నుగా నిలిపే సత్యమొకటి కావాలి
సత్యం కావాలి సత్యం

●

చరిత్ర దిగుడు లోయల్లో దాగిన
ధూళి రేణువులైన సరే సత్యమే కావాలి
నాగరికతా పుర వీధుల్లో
నగ్నంగా ఊరేగే అసత్యం వద్దు

●

కానీ –
ఎక్కడ చిక్కిందో సత్యం
అడుగు నుండి నడక దాక
నడక నుండి పరుగు దాక
పరుగు నుండి జీవితం దాక
సత్యం చుట్టూరా
అసత్యపు సర్ప పరిష్వంగాలే

●

ఎక్కడో అలా
సత్యం మినుక్కుమంటుందా
దాని వెనకాలే
బ్రహ్మాండమైన అసత్యాల ఊరేగింపు
●
అసలు అసత్యాలను మోసి మోసి
తన రూపు మార్చుకుందేమో సత్యం
అయినా!
దేహమంతా అసత్యాల ఖార్ఖానా అయినప్పుడు
నీకింకా సత్యమెక్కడ ఉదయిస్తుంది?

31-03-2015

# 29 నేనింకా ఏడ్వలేను

ఎంతకీ ఎడతెగని దుఃఖం ...
నేనింకా ఏడ్వలేను
ఇప్పుడొక కుండపోత వర్షాన్ని
వాంఛిస్తున్నాన్నేను ...

●

దుఃఖాన్నంతా ముంచెత్తే
ఆ వర్షంలో
ఇక ఒక్కసారే
నిలువెల్లా తడవాలి

దిక్కులు పిక్కటిల్లే
ఆ పిడుగుల మధ్య
బీభత్సంగా అరవాలి

●

ఏం బతుకురా ఇది!
కన్నీటి బొట్టంత ప్రశాంతత మాటున
కడలులుప్పొంగే సునామీ

09-02-2015

# 30 మ్యాన్ హంట్

జల్, జంగల్, జమీన్
జనాలది కాదన్న
జలగల జనగణమనలో
జరుగుతున్న
జన ఖననం
గ్రీన్ హంట్

2013

# 31 ముసుగు

కరెన్సీ నోటు కక్కుర్తికి
సూర్యోదయమాపగలరు

•

అరుణోదయ ప్రవాహాన్ని
వేలానికి పెట్టగలరు

•

ముసుగు బయట శాంతి పాట
కుట్రనేది లోని మాట

•

ఖాకీ ఖాదీ చొక్కా మడతల్లో
ముడుతలు పడ్డ జిందగీ!

24-04-2006

# 32 సామ్రాజ్యవాది

నాకేం ఎరుక
వాడు
చేతులు కట్టేసి
పిడికిలి బిగించమన్నడని
గొంతు నొక్కేస్తూ
నినాదమివ్వమన్నడని

●

నాకేం ఎరుక
వాడు
నడిచే దారిని తవ్వి పరిగెత్తమన్నడని
వేదికలన్నీ కూల్చేసి ప్రసంగించమన్నడనీ

●

నాకేం ఎరుక
వాడు
ఆకాంక్షను అంగడి చేసి ఉద్యమించమన్నడని
నిలువెల్లా గాయపర్చి మందు పూస్తున్నడనీ...

2012

# 33 పరుగు

నేనింకా
ఏం చేయగలను
నిద్రలో
కలలోను
నీ జ్ఞాపకంగానే మిగులుతున్న
●
నాకు మాత్రం ఉండదా
నీ ఉచ్ఛ్వాస నిశ్వాసలో
పల్లవించాలని... ప్రవహించాలని
నీ ఆశల సెలయేటిలో
ఉప్పొంగాలని... ఉరకలెత్తాలనీ...
●
కానీ ఏం చేయను
జీవితపు పరుగుపందెంలో
గెలుపుకోసం తపిస్తూ
అనుక్షణాన్ని కోల్పోతున్నా-
●
పరుగెత్తి పరుగెత్తి
అలసిపోయిన క్షణం

శరీరం చిందించిన స్వేదంలో
నిలువెల్లా కరిగిపోతున్నా

●

కానీ ఒక్క క్షణం
నువ్ గుర్తొస్తావ్ కదా
ఆ క్షణం
స్వేదాన్ని  ముంచెత్తే కన్నీళ్ళతో
నిలువెల్లా తడిసిపోతున్నా చెలీ!

●

నాతో నన్నే
పోటీకి పెట్టిన రాజ్యం
నీ నుండి నన్నే కాదు
నా నుండి నన్నూ దూరం చేస్తోంది

28-02-2015

# 34 కాసింత మంచి

మట్టి తన శాశ్వత చిరునామా అని తెలిసీ
మనిషికెందుకింత స్వార్థం-

●

చచ్చేదాక బతకడం అనివార్యమే
అయితే-
బతికినప్పుడు ఎవరికేం పంచుతున్నాం

●

స్వార్థం పక్షపాతంతో
అనుక్షణం పక్కవాడి చావుకోరే మనిషి...
తీరా వాడు చచ్చాక
'అరెరే.. పాపమని' కన్నీరు మున్నీరయ్యే మనిషి
సాటివాన్ని బతకనిచ్చిందెన్నడని

●

పోయినోడు మనకేం పంచగలడు
కాసింత మంచి తప్ప

●

పోయినోడికి మనమేం ఇవ్వగలం
కాసిన్ని కన్నీటి పూలు
కొన్ని జ్ఞాపకాలు తప్ప

# 35 లోపలి మనిషి

నేనెప్పుడు మాట్లాడినా
మనిషి గురించి కానే కాదు
మనిషిని పట్టి
కుదేసి నిలబెట్టి నడిపించే మనిషి గురించి
ఆ... లోపలి మనిషి గురించి

●

లోపలి మనిషికే తొడుగులుండవు
వాడు దివారాత్రుల్లోను
అన్ని సంధ్యల్లోను
దిగంబరంగా సంచరిస్తూ ఉంటాడు

●

నవజాతం నుండి వానప్రస్థం వరకు
కరుణ నుండి బీభత్సం వరకు
వాడికే గుణమైనా ఒకటే

●

బయట మనిషెప్పుడూ నాకు లెక్కలోకి రాడు
నిజానికి వాడు మనిషే కాదు

●

మనిషిని
నగ్న వాస్తవంలోకి ఈడ్చుకు వచ్చే
లోపలి మనిషంటేనే నాకిష్టం

21.06.2013

# 36 ఊరి పెద్దర్వాజ

నింగి, నేల, నీరు, గాలి, నిప్పులాగే
చేను, చెలక, చెట్టు, పుట్ట, గుట్ట
ఊరికి పంచభూతాలు

●

గ్లోబల్ రాకాసి
రియల్ రాబంధు అన్నింటికన్నీ మింగేసినంక
అక్కడొక గుట్ట మాత్రముండేది

●

ఏం లేకున్నా గుట్టను జూత్తే
కడుపు నిండినట్టుండేది
గుట్ట గుట్ట లెక్కనే ఉండేదా
గుట్ట ఊరి పెద్దర్వాజ

●

పంచ భూతాలన్నింటిని తన చుట్టూ
గిరగిరా తిప్పుకునే గుట్ట... కేవలం గుట్ట కాదు
అది ఊరి గుండె

●

ఎండను వానను మంచును
ఊరు మోయంగ
మిగిలింది మోసే
ఊరి కవచకుండలం గుట్ట

●

ఎన్ని యవ్వనాలకు
ఇంకెన్ని రహస్యోద్యమాలకు
సాక్ష్యమిచ్చిందో గుట్ట
గుట్టబోయినంక
ఊరు బజార్లపడ్డది

●

ఊరి పొలిమేరల్లోకి అడుగు పెడుతమో లేదో
గుండెల్లో బాంబులు పేలుతున్నయ్
ఫ్లైయాష్ ఎగిరొచ్చి ముఖానికి ఫేస్‌పౌడర్ అద్దుతున్నది

●

వాళ్ళను గుట్టకెత్తుకపోనూ
గుట్టలకు గుట్టలే
అమాంతం మింగుతాండ్లు

●

గుట్ట గిప్పుడు
గుట్టలెక్కనే ఉన్నదా
ఇప్పుడు,
గుట్టంటే గ్రానైట్
గుట్టంటే క్రషర్
గుట్టంటే గుండె పగిలిన ఊరు

●

నాకు తెల్వక అడుగుతున్నా
గీ గుట్టలు ఎవనయ్యకు పుట్టినయ్-

# 37 భూమి పుత్రుడు

అవును
అతడు చీకటిని జయించాడు
లోకానికి వెలుగులు పంచడం కోసం
●
అవును
అతడు చీకటిని ప్రేమించాడు
లోకం వెలుగును ఆస్వాదించడం కోసం
●
అనునిత్యం
మనకు వెలుగుల బ్రతుకునిస్తూ
క్షణక్షణం చచ్చి బ్రతికే భూమి పుత్రుడు అతడు
●
మనమంతా చివరి దశలో...
ఒక్కసారే
భూమాత గర్భంలో
అలా అలా ఒదిగిపోతాం ఒరిగిపోతాం-
అతను ప్రతీదినం భూమాత ఒడిలోనికి వెళ్ళి
చావుకి బతుక్కి మధ్య సంది కుదుర్చుకుంటాడు
●
అతని నవ్వు మాత్రమే కనిపిస్తుంది లోకానికి
కానీ,
రక్తాశ్రువుల చెమటధార అతని జీవితం
●

చావో బ్రతుకో
బ్రతుకో చావో
అనుక్షణం మృత్యువులోనే అతని సహచర్యం

తట్టా చెమ్మాసు
సబ్బలీ లాడీసులే
అతని ఆపన్న హస్తాలు
అవే అతని ప్రాణాధారాలు

●

ఎలాగోలా
ఇప్పటిదాకా
బతుకుబండిని నిండా మోస్తున్న అతడు
ఇప్పుడు ఓపెన్‌కాస్ట్ దింపుడు కల్లాల క్రింద
జిందగీని అన్వేషిస్తున్నడు

20-05-15

# 38 పంచ శ్రామికం

ఎవరి నెత్తురు ఈ నేల
ఎవరి స్వేదం ఈ నీరు
ఎవరి ఊపిరి ఈ గాలి
ఎవరి ఆక్రందన ఈ నింగి
ఎవరి ఆవేశం ఈ నిప్పు

01–05–2012

# 39 తిరోగమనం

ఎటు చూసినా
ఒక్క మనిషి కనిపించట్లేదు
నా దేశంలో-

•

ఇక్కడ
ఎక్కడ చూసినా జంతువులే
మనుషులేమో
అడవుల్లో తిరుగుతున్నరు-

07-10-2012

# 40 విష తరంగం

కిచ్‌కిచ్ కిచ్.. కిచ్...
పూరేడా పూరేడా...
ఎన్నేండ్లయిందో నిన్నుచూసి
నీ వయ్యారి తోకనాడిస్తూ ఉంటే
పులకరించి ఎన్నాళ్ళయిందో..!
ఆకాశమెత్తు సెల్‌టవర్ల రేడియేషన్‌కు
నేలరాలిన పిట్టపూవ్వి నువ్వు

●

మాటల వ్యాపారం కోసం నాటిన
విషతరంగాల శిఖరాల సాక్షిగా
నేలరాలిన పక్షులెన్నో ఎరిగితివా
నువ్వు అనుమతినిచ్చిన
టవర్ల మాటున
కూలిపోయిన కుటుంబాలెన్నో తెలుసునా?

●

సీతాకోక చిలకలు, తేనెలూరే తూనీగలు
కాకి పిలుపుల కాకిగుంపులు
గోరింకలు గువ్వలు ఉడతలు ఊయలలూగే సమరుకాకులు
పక్షిలేదు పక్షిలాంటి మనిషీ లేదు

పిచ్చుకలు కన్పించటం లేదనే వార్త తప్పు!

# 41 నేను - నువ్వు

ఎన్నివేల ఏండ్ల అనుబంధమో
మనిద్దరిది-

●

నాలా నువ్వు
నీలా నేను
ఎన్ని వేలసార్లు రూపాంతరం చెందామో!

●

నాకు నువ్వు లేకపోతే
నింగి నీరు నిప్పు గాలి
శూన్యమే కదా-

●

ఎన్నెన్ని సముద్రాలను
ఎన్ని వేల నదులను నీలో దాచుకున్నా
ఎన్ని అగ్నిపర్వతాలను గుండెల్లో మోస్తున్నా
ఎప్పుడు నిర్మలవదనంతో ఉంటావ్
చూడగానే చేతులెత్తి మొక్కేలా-

●

నేను లేనప్పుడు నీలో
ఎన్ని విస్ఫోటనాలు సంభవించలేదు
ఎన్ని అగ్నిపర్వతాలు బద్దలవ్వలేదు

నువ్వెన్ని గ్రహాల చుట్టూ తిరగలేదు
నా తోడు కావాలని–

●

ఎప్పుడైతే నేను వచ్చానో
ఎంతగా మురిసిపోయావో
ఇంకెంతగా ముద్దాడావో
తోడు లేక గడిపిన క్షణాలు గుర్తొచ్చి–
నన్ను నువ్వు గాఢంగా ప్రేమిస్తావ్
నాకోసమే యుగాల ఒంటరితనం అనుభవించావ్

●

నువ్వు కార్చిన కన్నీళ్ళు సముద్రాలై
నీ ఆనందభాష్పాలు నదులై ప్రవహించాయ్
నీ ప్రేమకు గుర్తులుగా
కొండా కోన చెట్టూ చేమా అవతరించాయ్
ఒక్కటేమిటీ నీ అణువణువు ప్రేమమయం...

●

నీ తనువులో
ఏ అణువును తాకినా
పులకించిపోయాను
తన్మయత్వం చెందాను–
నన్నింత వెర్రిగా ప్రేమిస్తున్న నిన్ను
కౌగిలించాలనీ
ముద్దాడాలనీ
నా చేతుల్లోకి నిన్ను తీసుకొని మురిసిపోవాలని
నాకనిపించని క్షణం లేదు

●

నువ్వేలేకపోతే ఈ లోకమేనేదే లేదు
నువ్వేలేకపోతే నాకు దేహమనేదే లేదు
నిజంచెప్పాలంటే నువ్వేలేకపోతే సమస్తమూ శూన్యం
నిన్నుచెరబట్టానో చెరిచానో లోయలుగా గుంతలుగా పొరలుపొరలుగా
వొలిచానో తొలిచానో గానీ ఎంతటి శాంత హృదయం నీది?

●

నీకు ప్రేమే కాదు
కోపమూ తెలుసు...
ఒక్కసారి నువ్వు శివాలెత్తితే
కంపించిపోతాను
గుండెలుపెంచుకొని పైకిలేస్తివా
భయంతో పరుగులు తీస్తాను
ఆవేశంతో నిప్పులుకక్కితివో
బిక్కుబిక్కుమంటూ నిన్ను వేడుకుంటాను...
దయగల భూతల్లీ! ప్రేమమూర్తీ!
ఆరాధించిన వెంటనే శాంతిస్తావ్

●

ఛీ! వెదవ జన్మ
దేన్ని పొందుతున్నామో
దేన్ని పంచుకుంటున్నామో
దాన్ని కాపాడలేకపోతున్నాం-

18-11-2012

# 42 ఆమె

సాయంత్రం వెలుతురు అస్తమిస్తుంది
ఉదయాన చీకటి అస్తమిస్తుంది...
ఆమె ప్రతీక్షణం అస్తమిస్తూనే ఉంటుంది

•

ఋతువులెన్ని మారినా
జీవితమంతా  ఆమెకు ఆకురాల్చు ఋతువే

•

ఆమె నవ్వు ఆమెకోసం కాదు
ఆమె అందం ఆమె కోసం కాదు
నిజానికి
ఆమె ఆమె కోసం కాదు-

•

ఆమె పంచుతున్న సుఖానికిలాగే
ఆమె స్వేదానికి
ఆమె కన్నీళ్ళకు గురుతుల్లేవ్

•

విలువలు లేని మనుషులు
వలువలు లేని మాటలతో
ఆమెను అంగడి బొమ్మంటూ గేలి చేస్తరు

సృష్టి ఆమెను బహిష్కరించిందో
ఆమెనే సృష్టినే బహిష్కరించిందో ఏమోగానీ

రహస్య  బంధిత జీవన్మరణ క్రీడలో
ఆమె ఎప్పటికప్పుడు దేహాలను విసర్జిస్తూనే ఉంటుంది
ఆమెది కోల్పోవడం అనివార్యమైన జీవితం

●

పచ్చని నోట్లతో
పచ్చిగా  ఆమె తనువులో  చొరబడగలమేమో గానీ
ఎన్నిరాసులు పోసి ఆమె మనసును తాకగలం

●

స్వేదం కన్నీళ్ళు నెత్తురు ఆవేదనే ఆమె నేస్తాలు
ఆమెకు కలలు లేవు కన్నీళ్ళే
అరె ఎందరికి తెలుసు ఆమె మనసు?

●

ఆమె కడుపు కోసం పడుపైంది గానీ
పడుపు కోసమే కడుపు గడప దాటలేదు

●

ఎందరు  వెంబడిస్తారో
ఇంకెందరు  నిష్క్రమిస్తారో
ఎన్ని వసంతాలు  కరిగిపోతాయో
ఎన్ని  స్వప్నాలు హత్య  చేయబడతాయో
దీపం  వెలుగుతున్నంత  కాలం
ఆమె ఓ ఆరిపోని దీపం

●

ఊరవతల ఉన్నా
ఆమెను ఊరిడ్సిపెట్టదు
ఆశగా  ఆమె వైపే చూస్తుంటుంది

10.02.2012

# 43 నీవు

నన్ను మొత్తంగా
నీలోకి కుమ్మరిస్తున్నా
నీ హృదయంలో నేను
నిండుకుంటున్న...

# 44 నిరుద్యోగి

రాజ్యం సూర్యుని చుట్టూ
చెప్పులరిగేలా తిరుగుతున్న
భూగ్రహానివి నువ్వు

●

గ్రహణాల్లాంటి ఉద్యోగ ప్రకటనల కోసం
చింత నిప్పుల్లాంటి కండ్లతో ఎదురుచూసే
అమావాస్యవి నువ్వు

●

కలపగుజ్జు కాగితాల్లో
మెదడును కాస్త నానబెట్టాకా
పైకి తేలిన నిస్సత్తువ దేహానివి నువ్వు

●

ఎప్పుడో రాని వసంతపు కొలువు కోసం
నిత్యం పరితపించే కోయిలవి నువ్వు

## 45 ప్రపంచీకరణ

ఎన్ని సముద్రాల్ని ధారపోసినా
జీవధారనివ్వని ఎడారిలా
ఎన్ని వసంతాలు గుమ్మరించినా
ఒక్క చిగురునివ్వని
తడిలేని విత్తనం
ప్రపంచీకరణ

46

# న్యాయం

గావుపట్టేవాడు
గావుకేక పెట్టేవాడు
ఒక్కడే అయిన చోట

పీడితుడు
పిడికిలి
ఒక్కటవ్వడమే న్యాయం

# 47 కులవర్సిటీ

విద్యలేకనే కులమనీ
విజ్ఞానంతోనే బలమన్న
విద్యాలయాల్లో
కులడ్రైనేజీకి ముక్కు పుటాలదురుతున్నాయ్
విజ్ఞానమేమో ల్యాబుల్లో కులుకుతోంది
●
బుద్ధిజీవులు
చౌకబారు ఆసిడ్ త్రాగి ప్రాణాలొదిలేస్తున్నరు
మేధావులేమో
గతితర్కానికి కొత్త అర్థం రచిస్తున్నరు
●
నిజంరా నాయనా
ఈ వర్సిటీ దేహపు పంచేంద్రియాల్లో
సీసం పోసారెవరో
ఇక అవి మాట్లాడలేవు వినలేవు కనలేవు

మీకు చదువులెందుకురా నా కొడకల్లారా
అని వాడు తిట్టినట్టు
రహస్యాలను మోస్తు అవి పునాదుల వంక
భయంగా చూస్తున్నాయ్
●

వర్సిటీల్లో కులమేందని గగ్గోలు పెట్టే విద్యాజీవి
నువ్వు రొమ్ము విరిచే లోపు
ఒక్క నవ్వు నవ్వి కులం
నిన్ను జెండాకెక్కిస్తున్నది
●
ఒరేయ్ నాయనా
నువ్వెన్ని థీసిస్సులు సమర్పించినా
కులాన్ని పోగొట్టే ఒక్క అధ్యాయం కనబడదేమిరా?
కులం పోవాలంటే కులాన్ని చదవాలని
ఒక్కడూ ప్రతిపాదించట్లేదేమిరా
●
అదిగో
వాడికి మత్తెక్కించినట్లుంది
అన్యాయమని అరిచి గోల చేసినవాడే
ధర్మం నాలుగు పాదాల మీదే
నడుస్తోందని ఢంకా భజాయించేస్తున్నడు
కుర్చీ కడుపుల సల్లగా నిద్రపోతున్నడు
●
కులమెక్కడికి పోయిందిరా డాక్టరేటు ?
పాకురు పట్టిన పాత కాలువలా
అది ప్రవహిస్తూనే ఉంది
పల్లె నుండి యూనివర్సిటీలకు పాకిందంతే

లైబ్రరీల్లో ఫంగస్ సోకిన పుస్తకాల్లా
క్యాస్ట్ వైరస్ జ్ఞానవ్రతం చేస్తోంది
అదును చూసి కాటేయడానికి-

12.03.2015

# 48 అపార్ట్‌మెంట్

పాత చేదబావిలోంచి తీసిన
పాతాళగరిగె మీద కూర్చున్నట్టుంటుంది
ఆ ఇంట్లో కాసేపుంటే-
●
ఒక్కొక్కరు ఒక్కో మూల
చూరుకు వ్రేలాడుతున్న గబ్బిలాల్లాంటి
ఆ మనుష్యుల మధ్య కాసేపుండటం
ఒక విశాదానుభవం
●
పక్కవాళ్ళతో ఏమో గానీ
ఎన్ని యుగాలైందో వాళ్ళు
ఒకరితో ఒకరు మాట్లాడుకోక

దు:ఖాలను షవర్ క్రింద కడిగేసుకొని
ఆనందాలను ఆన్‌లైన్‌లో షేర్ చేసే వాళ్ళతో
నేనేం షేర్ చేయగలను
●
ఎప్పుడో గాని
నాలుగు పొడిపొడి మాటల్ని
ఆ ఇంటి గోడలకు అతికించి
ఉన్న ఫలంగా నిష్క్రమిస్తాను అక్కడి నుండి
●
ఆ ఇంట్లోకి తొంగి చూడడమంటేనే
ఓ పాత రాతియుగాల నాటి మానవాన్వేషణ

# 49 హ్యూమన్ రోబో

గిగా బైటుల్లో మెదడును నింపుకున్నాకా
రక్తమాంసాలున్న మరమనిషి
నేటి నాగరికుడు

●

ఆంటీ వైరస్ ఇన్‌స్టాలవ్వక
కరప్టయిన నిలువెత్తు దేహంతో సంచరిస్తూ ....

కల్లోలిత సమాజంలో
కంప్యూటర్‌తోనే కరచాలనం చేస్తు
కలలను రోమింగ్ చేస్తుంటాడు వాడెప్పుడు

●

ఆండ్రాయిడ్ ట్యాబులకు
చూపు కాస్త అతికించాక
కళ్ళులేని కబోది అయినవాడు

ఆలోచన కీ ప్యాడ్ కాస్తా చెడిపోయాక
కంపెనీలకుపయోగపడే టచ్ స్క్రీన్ అవుతాడు

●

మొత్తంగా
స్పర్శని అనుభూతిని అనుభవాలను
బ్రౌజింగ్ చేస్తున్న ముఖపుస్తకం
వాడి జీవితం

# 50 కాళ్ళకు కట్టేసుకున్నా ...

ఎన్ని యుగాల నుండి
చెలిమెలూరాయో నా జాతి జనుల కన్నీళ్ళు –

●

ఏ వసంతాన్ని కౌగిలించకా
ఏ తాపాన్ని చల్లార్చుకోలేక
వేలాది పీడిత యుగాలు –

●

నిద్రను హత్య చేసిన రాత్రులు
ఆకలిని అవమానించి పాత్రలు
ఉనికిని వేటాడిన అధిష్టానాలు –

●

అడుగు నుండి పరుగు వరకు
గంజి నుండి గరళం వరకు
వెంటాడిన నెత్తుటి మరకలు

●

అందుకేనేమో – ఇంత దాహం
ఎన్ని నదుల్ని అమాంతం గుటకేసినా
ఎన్ని మైలురాళ్ళని కాళ్ళకు కట్టేసుకున్నా ...
తీరని దాహం
దాహం ... దాహం

# 51 వాడింకా మాతోనే...

ఫోన్ కాల్ దూరంలో ఉన్నాడనుకున్న వాడు
అడుగుల దూరంలోనే...
●
కంటితో చూసి
గుండెను నమ్మించలేని బ్రతుకులు మావి
●
ప్లీజ్ ఎక్స్క్యూజ్ మీరా !
ఉద్యోగాల వేటలో ఉన్నత చదువుల వేటలో
ఆకలితో ఆర్థికంతో కుటుంబంతో...
ఊరునొదిలి ఒకడు దేశాన్నొదిలి ఒకడు
రోజూ చస్తున్నాంరా బతకలేక
●
నువ్వనేవాడివే-
'బ్రతుకే సమస్యవడం పెద్ద విషాదమని'
ఏం చేయాల్రా బతకాలి కదా!
●
నిజానికి
ఇప్పుడిక్కడ ఎవడికెవడు లేడురా
ఒక్కొక్కటిగా తెగిపోతున్న బంధాలను
ప్రోది చేసుకోలేని బలహీనత అందరిది
●

ఒరేయ్ నీకు గుర్తుందా!
నువ్వూ పసునూరి ఖన్నా మనో నేను
ఖిలా వరంగల్ మట్టి కోటల మధ్య
చరిత్రను తవ్వి పోస్తూ
బాటనీ పుస్తకాల్లో అలా నిదురించేవాళ్ళం

క్రికెట్టు
రాక్‌స్టార్‌ల ఫోజులు కొడుతూ పాడిన జానపదం
ప్రేమదేశం సినిమా...ముస్తఫా ముస్తఫా...
తలుచుకుంటేనే మనసు కల్లోల సంద్రమౌతుందిరా ...
●
నీ జ్ఞాపకం ప్రతీసారి
రెండు కనుపాపల మధ్య
కన్నీటి చెలిమెలూరుతున్నాయ్
●
శివనగర్ రోడ్లపై నువ్వు విడిచిన గుర్తులనుంచి
పాల నురగ లాంటి నీ నవ్వు నుంచి
తప్పించుకు తిరగడం...
ఓ రంపపు కోత అనుభవం
నిజం చెప్పు
నువ్వింకా మాతోనే ఉన్నావు కదు.

చిననాటి మిత్రుడు తెల్లం కృష్ణమోహన్ స్మృతిలో...

# ఒక్క మాట ...

కవిత్వ మొక హృదయ భాష. హృదయం స్పందిస్తేనే కవిత్వం పుడుతుందనేది నా భావన. కొన్ని సంఘటనలు. చూసినపుడు కొన్ని విషయాలు విన్నప్పుడు అవి ఎంత తీవ్రమైనవైనా ఒక్కొక్కసారి హృదయం స్పందించకపోవచ్చు. కొన్ని తక్కువ తీవ్రత కలిగిన విషయాలకే హృదయం కల్లోలమౌతుంటుంది. కాని ప్రపంచీకరణ విషయం అట్లా కాదు. గ్లోబలైజేషన్ పర్యావసనాల తాలూకూ ప్రతి విషయానికి హృదయం స్పందిస్తుంది. మెదడు ఆలోచిస్తుంది. ఆలోచింపజేస్తుంది. దాని ప్రభావం అటువంటిది. ప్రపంచీకరణ మానవ జీవితానికి సంబంధించిన ప్రతీ వ్యవహారంలో, ప్రతీ అంశంలో చొరబడ్డది. ప్రతీ అంశాన్ని అది ప్రభావితం చేసింది.

ప్రపంచీకరణ వలన ప్రపంచం దూసుకుపోతోందంటూ కితాబిచ్చిన వాళ్ళు కూడా ఒక దశాబ్దం తర్వాత దాని దీర్ఘకాలిక విధ్వంసాన్ని గుర్తించలేకపోలేదు. అయితే సమాచార వ్యవస్థ మినహ అన్ని రంగాల్లో, అన్ని విషయాల్లో గ్లోబలైజేషన్ తన ప్రతాపాన్ని తన విధ్వంసకర ధోరణిని కొనసాగిస్తునే ఉన్నది. అయితే సెల్‌ఫోన్ మాటల వెనక కూడా కంపెనీల సామ్రాజ్యవాదం దాగి ఉంది. వినియోగదారులకు చేరుకోవడం పేరున విచ్చలవిడిగా టవర్లు వేస్తూ రేడియేషన్ పెంచుతూ మనిషిని ఆరోగ్యంగా దెబ్బతీస్తూ, కొన్ని వందల జీవ జాతులను నామ రూపల్లేకుండా చేసింది. మాటల వ్యాపారం పేరున లక్షల కోట్లు దండుకుంది. ఈ విషయాన్ని ఎవరు కాదనలేరు. సెల్‌ఫోన్‌లతో రోడ్డు పాలైన కుటుంబాలను మనం చూస్తూనే ఉన్నాం. ఉపయోగకరంగా ఉందనుకున్న సమాచార విప్లవంలోను ఇన్ని రకాల ప్రతికూలతలున్నప్పుడు ఇక ఏ మాత్రం మానవ జీవనానికి అనుకూలంగా లేని వాటి సంగతినెలా అర్థం చేసుకోవాలో తలపండిన మేధావులకు సైతం అర్థం కాని విషయమే.

ఇదిలా ఉంటే ...

తెలంగాణ మలిదశ ఉద్యమంలో నా 'నెగడు' కవితా సంపుటి వెలువడిన తర్వాత నెగడులోని కొన్ని కవితలు చూసి గ్లోబలైజేషన్ మీద నీకు మంచి పట్టు ఉందోయ్ అన్నారు పట్నం శేషాద్రి గారు. నిజానికి గ్లోబలైజేషన్ మీద ప్రత్యేకించి వ్రాసిన కవితలు కావవి. కాబట్టి సార్ చెప్పిన మాటలను నేను అంతగా శ్రద్ధ పెట్టలేదు. ఆ తర్వాత 'షాడో' కవిత్వ సంపుటి తర్వాత అదే శేషాద్రి గారు ప్రవీణ్ నీ తర్వాతి పుస్తకం ఖచ్చితంగా గ్లోబలైజేషన్ మీదే తీసుకురావాలి అని ఖరాఖండిగా చెప్పడం జరిగింది. 'నెగడు' (2012) నాటికే నేను పిహెచ్.డి చేస్తున్నందున నా పరిశోధనాంశం దృష్ట్యా సింగరేణి ప్రాంత జనజీవితాలను దగ్గరగా పరిశీలించడం జరిగింది. మరీ ముఖ్యంగా ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనులు చూసిన తర్వాత చలించకుండా ఉండడము ఎవరి తరమూ కాదు. ఇంత విచ్చలవిడిగా భూమిని తవ్వేస్తున్న తీరు బాధ కలిగించింది. ఈ విషయం గురించి ఇంకాస్త లోతుకు వెళ్ళి ఆ తర్వాత పరిశీలించడం మొదలుపెట్టిన తర్వాత ... ఇప్పటికే పీకలోతు గ్లోబలైజేషన్‌లో మనం కూరుకొని ఉన్నామనే విషయం అర్థమయ్యింది...

నేను గోదావరిఖని సింగరేణి ప్రాంతంలో పర్యటిస్తున్నపుడు ఒక ముసలాయన అన్న మాటలు నన్ను పట్టి ఊపేసాయి. ఆయన అంటాడు... "మా అయ్య వ్యవసాయం చేసి బతికిండు. నాతరం వచ్చేసరికి ఉన్న భూములు కాస్త సింగరేణి సంస్థ తీసుకోవడంతో పక్క ఊరిలో వ్యవసాయ కూలీగా బ్రతికిన ... నా కొడుకుతరం వచ్చేసరికి ఓపెన్‌కాస్ట్ బొగ్గు బావులతో అసలు భూమే లేదు... భూమి ఉంటే భూమిపై ఆధారపడి కూలీనాలో చేసుకుని బ్రతికినం అసలు భూమే లేకుంటే బ్రతికేదెట్లా" ... అని ఆయన వెలిబుచ్చిన ఆవేదన నిజంగా నన్ను ఆలోచింపచేసింది. మనిషి అడుగు కింది నేలను తొలిచేస్తున్న 'ప్రపంచీకరణ' కళ్ళకు కట్టినట్లయింది.

* * *

వాస్తవానికి టెక్నాలజీ, అభివృద్ధి పరదాల మాటున దాగిన కఠోర సత్యాలు వేరుగా ఉన్నాయి. మన్ను నుండి మిన్ను దాకా ఎగబాకిన మనిషి, మనిషి నుండి మనిషి దాకా ఎందుకు ఎదగడం లేదన్నది అర్థం చేసుకోవాల్సి ఉంది. డబ్బు ప్రభావంతో మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలనే మాటను అక్షరాల నిజం చేస్తున్న వాళ్లతో

కాసింత మానవత్వాన్ని ఈ టెక్నాలజీ ఎందుకు పుట్టించలేకపోతున్నదని ప్రశ్నించాల్సి ఉంది. మట్టి ... మనిషి ... మనీ త్రివిక్రమత్వంగా సాగుతున్న నేటి కాలపు మానవ జీవితాల్లో చివరకు మిగిలేదేంటనే ప్రశ్న ఎందుకు ఉదయించట్లేదనేది అర్థం చేసుకోవాల్సి ఉంటుంది... అందాల ఆకాశ హర్మ్యాల వెనకాల ఉన్న మురికివాడల దీనస్థితిని, యాంత్రీకరణ ఫలితంగా ఉన్న పని కాస్త ఊడి ఆకలి చావులు చస్తున్న సగటు మనిషి బ్రతుకును అర్థం చేసుకోవాల్సి ఉంది. ప్రపంచీకరణలోనూ గట్టిపడుతున్న కుల పునాదులని దాని వెర్రి పోకడలను అర్థం చేసుకోవాల్సి ఉంది. ఎంత చదివినా కాస్తంత బ్రతుకునివ్వని ఆధునిక రాజ్యపు పోకడలను అర్థం చేసుకోవాల్సి ఉన్నది. గ్లోబల్ దేగ నీడలో చెట్టుకొకరం పుట్టకొకరం ఎందుకవుతున్నామో, రోజువారి వాయిదాల్లో జీవితాన్ని ఎందుకు కోల్పోతున్నామో అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. సాటి మనిషి పట్ల కాస్తంత జాలి, దయ లేకుండా బండరాళ్ళుగా జనాలెందుకు మారుతున్నారో, వాళ్లని అలా నెట్టి వేయడానికి ప్రేరేపిస్తున్న పరిస్థితులను అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. చెట్టు, గుట్ట, పిట్ట, పువ్వు వనరులన్నీ అన్యాక్రాంతమవుతూ త్రాగే గుక్కెడు నీళ్ళు కూడా కొనవలసిన పరిస్థితెందుకు దాపురించిందో అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఇలా ఇవన్నీ అర్థం చేసుకోవాలంటే ప్రపంచీకరణను అర్థం చేసుకోవాల్సి ఉంటుందనేది సుస్పష్టం.

* * *

ప్రపంచీకరణకు సంబంధించిన అన్ని అంశాలను ఇందులో పొందుపరచానని చెప్పడం నా ఉద్దేశ్యం కాదు ... ఎంత చెప్పుకున్నా ఎంత వలపోసుకున్న ప్రపంచీకరణను మొత్తంగా చెప్పినట్లు కాదనేది నా భావన. ఇంత విస్తృతి కలిగిన ఈ అంశంపై కొంత చెప్పే ప్రయత్నమే 'గ్లోబలి' – గ్లోబలికి ముందు విషయాలివి.

ఇక గ్లోబలి ప్రతి సిద్ధమైన తర్వాత దీన్ని పుస్తకంగా తీసుకువద్దామని అనుకుంటున్నానని డా. శ్రీనివాస వర్మకు ఒక సందర్భంలో చెప్పడం ఆయన ఐయామ్ విత్ యూ అంటూ కొంత ఆర్థిక సహాకారం అందించడం ... ఆ తర్వాత పెద్దన్న కొలిపాక శ్రీనివాస్, నా ప్రియమిత్రుడు రేనా ఈశ్వర్, బాబాయ్ హైమత్ పాషా... వీళ్ళు క్షణం కూడా ఆలోచించకుండా తన వంతు సహాయం చేయడం ఇవన్నీ గ్లోబలి పుస్తక రూపం తీసుకురావడానికి కారణాలయ్యాయి.

తీవ్ర పని ఒత్తిడిలో ఉన్నప్పటికీ కవిత్వానికి ముందు మాటలు వ్రాసి నన్ను ప్రోత్సహించిన సుప్రసిద్ధ కవి, రచయిత, విమర్శకులు కాసుల ప్రతాపరెడ్డి గారికి ధన్యవాదాలు. ఇక్కడ సీతారాం సార్ గురించి కూడా రెండు మాటలు చెప్పుకోవాలి. ఆయన పాఠాలు వినే అదృష్టం లేకపోయిన ఆయన చెప్పే బ్రతుకు పాటాలను వినే అదృష్టం మాత్రం దక్కింది నాకు ... మహబూబాబాద్‌లో ఒకే ప్రాంగణంలో సార్ డిగ్రీ కళాశాలలో నేను పీజీ కళాశాలలో అధ్యాపకులుగా ఉండడంతో నాకు ఈ అవకాశం దక్కింది... నిక్కచ్చి, నిజాయితీ, కమిట్‌మెంట్‌కు నిలువెత్తు రూపమైన సీతారాం సార్ ఇటీవలి మా యువతరం కవులందరికీ ఇన్స్పిరేషన్. గ్లోబలికి ముందుమాట రాసి నన్ను ప్రోత్సహించిన సీతారాం సార్‌కి ధన్యవాదాలు.

ఇక నేను బాబాయ్ అని ప్రేమతో పిలుచుకునే కవి అన్వర్ గారు గ్లోబలీ అంకితం తీసుకోవడానికి అంగీకరించినందుకు ... వారికి – పుస్తక సమయంలో సహకరించిన, నిత్య జీవితంలో ప్రేమిస్తున్న, ద్వేషిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ–

05–05–2015 **డా. చింతం ప్రవీణ్ కుమార్**

# గ్లోబలి వెనుక ...

వాస్తవంలోని అసలు మనిషి జీవితాన్ని ఆవిష్కరించాలన్న తపన చింతం రచన లోని నగ్నత్వం. మనిషి తన ముఖాన్ని అద్దంలో చూసుకున్నంత సౌలభ్యంగా సగటు మనిషి తన భావాలను అర్థం చేసుకున్ననాడే తన రచనలకు సార్థకత చేకూరుతుందన్న విశ్వాసం అతనిది. తన భావాలకు సరళత కలిగిన పదాలను వెదుకుటలో నిద్రను నింగిన రాత్రుల అనుభవం అతనిది.

కవిత్వానికి సౌందర్యం పొదపకుండా కావ్యం రంజిల్లదు అనే సాహితి ప్రస్తావన కూడా ఉంది. నిజానికి సౌందర్యానికి ఒక నిర్దిష్టత అంటూ ఏమిలేదు అది వ్యక్తుల తృష్ణ, అభిలాషకు సంబంధించిన పాక్షిక అంశమే కాని జీవిత సర్వస్వము కాదు. యదార్థాన్ని గాఢంగా ఆవిష్కరించితే చాలు కావ్యార్థానికి సార్థకత చేకూరి తీరుతుంది. సౌందర్యముతో వొనగూడేది ఏమిలేదన్న సత్యాన్ని రుజువు చేసుకున్నట్లుగా చింతం గ్లోబలి కొనసాగింది.

సాధారణ పాఠకుడు సైతం చదవగానే కవితలోని భావాన్ని రపీమని అర్థం చేసుకోగల సరళత ఇందులో ఉంది. ఉదా ॥

ఎడారిలో
నీల్లు దొరకని చోట
కన్నీల్లనైనా
తాగి బతుకగలను
కాని
కులమున్న చోట
ఎన్ని జీవనదులున్న మనిషిగా బ్రతకలేను అంటాడొక కవితలో –

ఈ సాంఘీక వ్యవస్థలో జన్మించినవాడు, జీవిస్తున్నవాడు. ఇది ఈ సాంఘీక వ్యవస్థలో తర్కించుకొని, శోచించి లోకాన్ని శోధించి భావాన్ని అర్థం చేసుకోవాల్సిన గత్యంతరం వుంది. ఈ విధంగా గ్లోబలి లోని ప్రతి కవిత యధార్థ జీవితాలకు సంబంధించిన అనేక విషయాలను, విలువలను తడుముతు సాహిత్యానికి ఉండవలసిన సామాజిక భాధ్యతను నెరవేరుస్తూ ముందుకు సాగిందీ గ్లోబలి –

నగరాలు నాగరితకు నమూనాలు అంటూ కొనసాగుతున్న చారిత్రక ప్రచారాన్ని బద్దలు కొడుతు దాని నగ్నత్వాన్ని బట్టబయలు చేస్తాడు. దాని సాంఘీక జీవనం ఏవిధంగా వుందో దాని గొప్పతనం ఏ పాటిదో, 'నగరం' అనే కవితలో విశదీకరిస్తాడు.

"నగరం క్యాపిటలిస్టు చేతిలో కార్మికుని స్వేదం

అన్నార్థుల చేతిలో ఆకలి పల్లెం

నిరుద్యోగి చేతిలో విషపు మాత్ర

ఉన్మాది చేతిలో ఆసిడ్ పాత్ర" అంటాడు. నిజానికి ఇక్కడ మనిషి, మనిషిని ప్రేమించలేదు. ఆదరించనూ లేదు. ఇక్కడ మనుష్యుల మధ్య ఉన్నది యాంత్రిక వ్యాపార సంబంధమే. మాట తీరులోను, నడతలోను నాటికీయతే ఎక్కువ అంటాడు ఇది సంపన్నుల స్వర్గదామం, నేరగాల్ల గుడారం. సామాన్యుడు రాత్రిల్లు భయం నిద్రపోయే అనుభవానికి ప్రతిరూపం అంటూ నగర జీవనంలో కనుమరుగౌతున్న మానవ సంబంధాలు యెడల అందోళన చెందుతారు.

కొండలు, గుట్టలు, అడవులు, చెట్లు, జంతు, పక్షి జాతుల నివాస ప్రాంతాలు జీవ జాతుల మనుగడకు అవసరమైన ప్రాకృతిక ప్రసాదితాలు కానీ సంపదను కాంక్షించే ధనాశపరుల వ్యాపార కేంద్రాలయి ప్రాపంచిక వ్యాపార వస్తువయ్యిందని వామనుడు భూమిని, ఆకాశాన్ని చివరకు మానవ శిరస్సుపై కాలు మోపి దుష్టత్వానికి తలపడినట్లు సామ్రాజ్యవాదం ఈ దేశంలో విధ్వంసకర పాత్రను నిర్వహిస్తున్నదని..... 'ఊరి పెద్ద దర్వాజ' కవితలో ఈ వనరులు ఎవడబ్బ సొత్తని రాజ్యాన్ని నిలదీస్తాడు.

మాటల వ్యాపారం కోసం నాటిన

విషతరంగ శిఖరాల సాక్షిగా

నేల రాలిన పక్షులెన్నో ఎరిగితివా

నువ్వు అనుమతిచ్చిన టవర్ల మాటున

కూలిపోయిన కుటుంబాలెన్నో తెలుసునా ?

రేడియోధార్మికత ప్రకృతిలోని జీవశక్తిని హరించివేస్తున్నది. పర్యావరణ సమతుల్యతను నాశనం చేస్తున్నది దీని ప్రత్యక్ష ప్రభావం తక్షణం మనిషిపై చూపుతున్నట్లు అనిపించదు కాని మానవ జీవన విధానంలో కనిపిస్తుంది. అనాదిగా మానవ జీవితంతో పెనవేసుకున్న జీవితం పక్షిజాలానిది అవి మానవ జీవితాన్ని ఎంతగా ప్రభావితం చేశాయో ఎంతగా రంజింపజేశాయో ఒక్క మాటలో చెప్పచూడడం సాహసమే అవుతుంది. అలాంటి పక్షిజాలం ఈ రేడియో ధార్మికత వల్ల అంతరించిపోతున్నది. కళ్ల ముందు కనిపించిన పిచ్చుకలు మటుమాయమయ్యాయి. ఇంతటి హింస సాదృశ్యానికి సెల్ టవర్సు ప్రత్యక్ష నిదర్శనాలని ఆధునిక సాంకేతిక విశృంఖలత్వాన్ని గుడ్డిగా అనుసరిస్తున్న రాజ్యాన్ని ఛీ కొడతాడు ప్రవీణ్.

* * *

నేను సత్యాన్వేషినని ప్రకటించుకుంటాడు. సత్యమొకటే మనిషిని మనిషిగా నిలుపుతుందని విశ్వసిస్తాడు. సత్యం కోసం ఏ బంధాలనైన వదులుకోవడానికి సిద్ధమంటాడు. దానికోసం ఏ దిగంతాలకైన పయాణమవుతాడని ప్రకటిస్తాడు. అందుకే కాబోలు సిరాను ఒలికించి అక్షరాలను వ్యాఖ్యాలుగా నిర్మించేటప్పుడు గుండెలోతుల్లో కొండంత మదనం ఉంటుందని అంటాడు. ఎందుకంటే సత్యానికి దూరంగా వ్యాఖ్య నిర్మాణం జరుగుతుందేమోనన్న భయం అతనిది.

అనేక విలువలు విషయాలతో యాభై కవితలను కూర్చి చింతం గ్లోబలిని నిర్మించాడు. సామాజిక యధార్థాలను సాటి మనుష్యులతో పంచుకోవాలన్న తపన, ఆత్రం, ఆరాటం అంతర్లీనంగా గ్లోబలి నిండా కనిపిస్తూ ఉంటుంది. సమాజం యెడల అంకిత భావం కల్గి ఉన్నందుకు చింతం ప్రవీణ్ కృతార్థుడు.

గ్లోబలిపై నీ అభిప్రాయం రాయాలి అని చింతం నన్ను అడిగినప్పుడు ఓపికగా కూర్చుండి వ్రాయలేని పరిస్థితి నాది నీకు న్యాయం జరుగదన్నాను. ఇది న్యాయ, అన్యాయాలకు సంబంధించినది కాదు, మన మధ్య ఉన్న అనుబంధానికి ఓ అక్షర సాక్షం కావాలన్న నా ఆశకు సంబంధించింది కనుక నువ్వు వ్రాసీ తీరాల్సిందే అంటు శాసించినట్టే శ్వాసించాడు. నిజానికి నాకిది కాల పరీక్ష అందుకే నా ఈ చిన్న వ్యాఖ్యానం.

**అభినందనలతో**

**రాసో**

| | | |
|---|---|---|
| పేరు | : | **డా. చింతం ప్రవీణ్‌కుమార్** |
| కలం పేరు | : | చింతం ప్రవీణ్ |
| అమ్మ నాన్నలు | : | చింతం యాదవ్వ – రాజేశ్వర్ |
| నివాసం | : | 16–10–236, శివనగర్, వరంగల్ |
| అక్కా చెల్లెలు | : | బొట్టు కరుణ – రామినేని కవిత |
| తమ్ముడు | : | చింతం గిరి వర్మ |
| సహచరి | : | జ్యోతి |
| పిల్లలు | : | తరుణ్ మణి – పల్లవి గాయత్రి |
| చదువు | : | **పిహెచ్.డి (తెలుగు)** – కాకతీయ విశ్వవిద్యాలయం, హన్మకొండ<br>**ఎం.ఎ** (తెలుగు – లిటరేచర్) –<br>కాకతీయ విశ్వవిద్యాలయం, హన్మకొండ<br>**ఎం.సి.జె** –కాకతీయ విశ్వవిద్యాలయం, హన్మకొండ<br>**బి.కాం** – కాకతీయ డిగ్రీ కళాశాల, హన్మకొండ<br>**ఇంటర్మీడియట్** – గవర్నమెంట్ జూనియర్ కళాశాల, హన్మకొండ<br>**పదవ తరగతి** – ఆర్య వైశ్య హైస్కూల్<br>**ప్రాథమిక, మాధ్యమిక విద్య** – వందన పాఠశాల, శివనగర్ |
| రచనలు | : | **"నెగడు"** తెలంగాణ కవిత్వం (2012)<br>**షాడో** (2013)<br>**బొడ్రాయి** – సాహిత్య వ్యాసాల సంపుటి (అముద్రితం) |
| **సామాజిక విషయాలు** | : | జర్నలిస్టుగా, కాలమిస్టుగా వివిధ పత్రికల్లో 2006 నుండి ...<br>నవ సమాజ్ సేవా సమితి (NSSS) అనే స్వచ్ఛంధ సంస్థ నిర్వహణ<br>బి.సి స్టడీ ఫోరం కన్వీనర్‌గా బాధ్యత |
| అవార్డులు | : | ఉత్తమ కవి అవార్డు (2012, ఆగష్టు 15న, వరంగల్‌లో)<br>(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం)<br>ఉత్తమ యువ సాహితీవేత్త అవార్డు (12 జనవరి 2015)<br>(భారత సర్వీసుల శాఖ, నెహ్రూ యువకేంద్రం వారు) |